



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY



ఈ స్థలం [22 సెంట్లు]

అమ్మబడును




సంప్రదించవలసిన నెంబర్లు

కె. అబెద్నేగో(రాజు బాబు ) : 9985998066

సిహెచ్. సురేష్ : 9959996243

RAYAVARAM MANDAL, RAYAVARAM VILLAGE, EGDT : 533346



SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 సంచిక : 196 తూర్పుగోదావరి జిల్లా ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ బుధవారం 08 ఏప్రియల్ 2026 పేజీలు : 12 వెల : 2/-


## సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా

# రాయలసీమ



- భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ట్రాన్స్‌మిషన్ లైన్స్
- ఏపీలో ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల తయారీపై ప్రత్యేక దృష్టి
- వ్యవసాయ వ్యర్థాల సద్వినియోగం జరిగేలా యూనిట్ల ఏర్పాటు
- ఆధునిక భద్రతా ప్రమాణాలతో పారిశ్రామిక ప్రాజెక్టులు
- ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 16వ ఎస్ఐపీబీ సమావేశం
- రూ.39,436 కోట్ల విలువైన 31 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపిన 16వ ఎస్ఐపీబీ
- ఈ ప్రాజెక్టుల ద్వారా ప్రత్యక్షంగా 1,11,278 మందికి ఉద్యోగ అవకాశాలు
- అమరావతి క్వాంటం వ్యాలీలో 3 సంస్థల ఏర్పాటుకు ఎస్ఐపీబీ గ్రీన్ సిగ్నల్

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో సౌర విద్యుత్ ఉత్పత్తి చేసే పూర్తి సామర్థ్యాన్ని వినియోగిం చుకునేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రత్యేకించి రాయలసీమ జిల్లాల్లో సౌరవిద్యుత్ ప్రాజెక్టులను పెద్ద ఎత్తున ఏర్పాటు చేసి పునరుద్పాదక విద్యుత్ ను తయారు చేసుకునేందుకు వీలుందని ఆయన సూచించారు. దీనికి అనుగుణంగా ఈ రంగంలో పెట్టుబడులను ఆకర్షించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అలాగే ఉత్పాదనకు మిగతా .. 2లో..

## భారత్ ధర్మసత్రం కాదు

### కేంద్రమంత్రి అమిత్ షా



**విశ్వం వాయిస్ న్యూస్ :** అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు సమయం దగ్గర పడుతుండటంతో ఆయా రాష్ట్రాల్లో ప్రచారం జోరుగా సాగుతోంది. తాజాగా అస్సాంలోని బరాక్ లోయలో జరిగిన ఎన్నికల ప్రచారంలో కేంద్ర మంత్రి అమిత్ షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అక్రమ చొరబాటుదారుల ప్రస్తావన తీసుకొచ్చారు. పశ్చిమ బెంగాల్‌లో అభివృద్ధి జరగాలన్నా, అక్రమ చొరబాటుదారులను తరిమికొట్టాలన్నా అది భాజపా వల్లే సాధ్యం అవుతుందని పేర్కొన్నారు. భాజపా అధికారంలోకి వస్తేనే ఇవన్నీ జరుగుతాయన్నారు. బరాక్ లోయలో బెంగాలీలు ఎక్కువగా ఉంటారు. దీంతో ఆయన బెంగాల్‌లో అక్రమచొరబాటుదారుల అంశాన్ని పేర్కొనడం గమనార్హం. "పౌరసత్వ సవరణ చట్టం ప్రకారం గూఢ ధర్మం చేసే వ్యక్తులకు దేశంలో స్థానం లేదని తెలిసే ఆ చట్టాన్ని కాంగ్రెస్ వ్యతిరేకిస్తోంది. రెడ్ కార్పెట్ వేసి మరీ అక్రమ చొరబాటుదారులకు ప్రవేశం కల్పిస్తోంది. భారత్ ధర్మసత్రం కాదు. అక్రమ చొరబాటుదారులకు ఇక్కడ స్థానం లేదు. ఒక్కసారి భాజపా అధికారంలోకి రాగానే రాష్ట్రంలో మార్పు మొదలవుతుంది. బెంగాల్‌లో ఉన్న చొరబాటుదారులను తిరిగి వారి దేశాలకు వెళ్లగొడతాం" అని మిగతా .. 2లో..

అమరావతిలో ఎన్ఎఫ్‌డీబీ ప్రాంతీయ కార్యాలయానికి

## కేంద్రం గ్రీన్ సిగ్నల్

- మత్స్యరంగానికి నూతన దిశ, మత్స్యకారులకు విస్తృత ప్రయోజనాలు
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడి



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** అమరావతిలో నేషనల్ ఫిషరీస్ డెవలప్మెంట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. సీఎం చంద్రబాబు కేంద్రానికి లేఖ రాయబట్టే ఎన్ఎఫ్‌డీబీ ఏర్పాటుకు కేంద్రం ముందుకు వచ్చిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలో ప్రముఖ ఆక్వాకల్చర్ రాష్ట్రంగా ఉండటంతో అమరావతిలో పూర్తి స్థాయి ప్రాంతీయ కేంద్రం ఏర్పాటు మిగతా .. 2లో..

# జల సంరక్షణకు కట్టుబడి పని చేద్దాం

- జల్ జీవన్ మిషన్ 2.0లో జల సంరక్షణకు ప్రాధాన్యం
- ప్రజల్లోనూ చైతన్యం కలిగించాలి
- 100 రోజుల స్పెషల్ డ్రైవ్ కు శ్రీకారం
- భవిష్యత్తు తరాల కోసం నీటిని కాపాడుకోవడం తప్పనిసరి
- 'గ్రామీణ తాగునీటి సరఫరా వ్యవస్థలో జలవనరుల స్థిరత్వం' వర్క్ షాపు ప్రారంభించి, ప్రసంగించిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** 'జలమే జీవం... జీవమే జల సంరక్షణకు మూలం అనే చైతన్యం ప్రతి ఒక్కరిలో రావాలి. సాధారణ ప్రజలు ఇళ్లలో వాడే నీటిని తిరిగి భూమిలోకి పంపే చర్యలు నుంచి వాగులు, వంకలు, నదుల ద్వారా వృథాగా సముద్రంలో కలుస్తున్న నీటిని కాపాడుకునే వరకు ఈ చైతన్యం అందరిలో వెల్లివిరియాల'ని ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ ఆకాంక్షించారు. భూమి మీద మనిషికి అవసరం అయ్యే నీటి శాతం చాలా తక్కువగా ఉంది.. దాన్ని జాగ్రత్తగా కాపాడుకోకపోతే భవిష్యత్తు తరాలకు తీరని అన్యాయం చేసినట్లేనని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల పరిధిలో గ్రామీణ తాగునీటి సరఫరా వ్యవస్థలో జలవనరుల స్థిరత్వంపై ఒక రోజు వర్క్ షాపు కానూరులోని ఏపీఎస్ఐఆర్డీ భవన్ లో మంగళవారం ఉదయం మొదలైంది. ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి పవన్ కళ్యాణ్ ప్రారంభించారు. అనంతరం పవన్ కళ్యాణ్ ప్రసంగిస్తూ "నీరు ఎక్కడుంటే అక్కడ అభివృద్ధి బాగుంటుంది. ప్రజల జీవన స్థితిగతులు మెరుగుపడతాయి. ఆంధ్రప్రదేశ్ ప్రజల జీవన విధానం మెరుగవడానికి గోదావరి, కృష్ణా, పెన్నా, మిగతా .. 2లో..

ఆదాయానికి మించి ఆస్తులు..

## దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ అరెస్టు




**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీ దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ కాళింగిరి శాంతి అరెస్టయ్యారు. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్లు అందిన ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు.. తాడేపల్లి, ఉండవల్లి సహా 4 ప్రాంతాల్లో మంగళవారం ఏకకాలంలో సోదాలు చేపట్టారు. తనిఖీల్లో భాగంగా భారీగా అక్రమ ఆస్తులను మిగతా .. 2లో..

యూఏఈని ఎగతాళి చేసి..

## భారత్‌పై విషం కక్కి

### పాక్ సెనెటర్ ప్రేలాపనలు



**విశ్వం వాయిస్ న్యూస్ :** పాకిస్థాన్ చట్టసభ సభ్యుడు ముషాహిద్ హుస్సేన్ భారత్‌పై తనకున్న ద్వేషాన్ని మరోసారి బయటపెట్టారు. భారత్-యూఏఈ మధ్య పెరుగుతున్న సంబంధంపై మాట్లాడుతూ.. యూఏఈ కూడా మరో భారత్‌గా మారకుండా జాగ్రత్త పడాలంటూ ప్రేలాపనలు చేశారు. యూఏఈ చాలా బలహీనమైందని.. ఆ దేశంలో భారతీయులు అత్యధికంగా ఉన్నందున అక్కడి ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఉచిత సలహా ఇచ్చారు. యూఏఈ అభివృద్ధిలో పాక్ పాత్ర చాలా ఉందంటూ ప్రగల్భాలు పలికారు. ఓ టీవీ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో.. యూఏఈ ఆర్థికంగా మిగతా .. 2లో..

## ఈ రాత్రితో ఇరాన్ నాగరికత అంతం..

### ట్రంప్ వార్నింగ్



**విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి ఇరాన్‌కు తీవ్ర హెచ్చరికలు చేశారు. ఇరాన్ నాగరికత మొత్తం నేటి రాత్రితో అంతమైపోతుందని అన్నారు. దానిని మళ్లీ ఎప్పటికీ పునరుద్ధరించలేరని 'ట్రూత్ సోషల్' వేదికగా పోస్టు పెట్టారు. ఇరాన్‌లో 47 ఏళ్లుగా ఉన్న అవినీతి, అరాచక పాలన అంతం కానుందని.. ప్రపంచ చరిత్రలో ఈ రాత్రి ఓ మైలురాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. ఆ దేశాన్ని తుడిచిపెట్టడం నిజానికి తనకు ఇష్టం లేదని.. కానీ ఆ విధంగా చేయక తప్పట్లేదని పేర్కొన్నారు. అయితే, ఇరాన్‌లో కొత్త, మిగతా .. 2లో..

## నాతో సహా నా దేశప్రజలు ప్రాణత్యాగానికి సిద్ధమే

### ఇరాన్ అధ్యక్షుడు



**విశ్వం వాయిస్ న్యూస్ :** హర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరిచేందుకు అమెరికా విధించిన డెడ్‌లైన్ సమీపిస్తున్న సమయంలో ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. యుద్ధంలో ప్రాణాలను త్యాగం చేయడానికి తనతో సహా ఇరాన్ పౌరులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చినట్లు తెలిపారు. దేశం కోసం ప్రాణత్యాగం చేయడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నానన్నారు. ఏదేమైనా పోరాటాన్ని ఆపే ప్రసక్తే లేదన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. మరికొన్ని గంటల్లో ఇరాన్ హర్మూజ్‌ను తెరవకపోతే ఆ దేశంలోని అనేక మిగతా .. 2లో..

టాస్ ఎవరిది? మ్యాచ్ ఏ టీమ్ గెలుస్తుంది?

## ఈ ప్రకటనలతో జాగ్రత్త

### హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఐపీఎల్ క్రికెట్ ఫీవర్‌ని ఆసరాగా చేసుకొని కొందరు వ్యక్తులు చేస్తోన్న మోసపూరిత ప్రకటనలపై పోలీసులు అప్రమత్తమయ్యారు. కేవలం డబ్బు కోసం కొందరు ఇన్‌ఫ్లూయెన్సర్లు అసత్య ప్రచారాలు చేస్తూ సామాన్యుల్ని తప్పుదోవపట్టిస్తున్నారని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ తెలిపారు. టాస్ ఎవరిది? మ్యాచ్ ఏ టీమ్ గెలుస్తుంది? అని ముందే చెబుతామంటూ అమాయకుల్ని తమ ఛానెల్స్‌లో సబ్‌స్క్రైబ్ చేయించుకొని నిలువునా ముంచే బెట్టింగ్ ఊబిలోకి లాగుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అలాంటి నకిలీ ప్రిడిక్షన్ ఛానళ్లలో చెప్పే మాటలు నమ్మి మోసపోవద్దని, కష్టార్జితాన్ని పోగొట్టుకోవద్దని ఈ సందర్భంగా మిగతా .. 2లో..

కోనసీమలో

## బాంబు స్క్వాడ్ తనిఖీలు



**కోనసీమ, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఐపిఎస్ ఆదేశాల మేరకు ప్రయాణికుల భద్రత కొరకు ఈరోజు అనగా 2026 తేదీ సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు అమలాపురం ఆర్టీసీ బస్టాండ్ పరిసరాలలో మరియు ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ఉన్న బస్సులను, పార్సిల్ కౌంటర్ నందు అన్ని రకాల పార్సిలను జిల్లా బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, శిక్షణ పొందిన డాగ్స్‌తో క్షుణ్ణంగా మిగతా .. 2లో..

## జాబిల్లి కాదు.. మన వసుంధరే..



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఆర్టెమిస్-2 మిషన్‌లో భాగంగా చంద్రుని చుట్టూ ప్రదక్షిణ చేసిన వ్యోమగాములు.. తిరిగి భూమి వైపు తమ ప్రయాణం మొదలుపెట్టారు. ఈ క్రమంలోనే చంద్రుని అవతలి వైపు నుంచి వ్యోమగాములు తీసిన భూమి ఫొటోను నాసా విడుదల చేసింది. తిరుగు ప్రయాణంలో ఈ మిషన్ కమాండర్ రీడ్ వైస్‌మాన్ ఈ ఫొటో తీసినట్లు తెలుస్తోంది. ఈ చిత్రాన్ని అమెరికా అధ్యక్ష కార్యాలయం మిగతా .. 2లో..

కుక్కల దాడిలో

## చిరుత కూన మృతి



**దువ్వూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** వైఎస్సార్ కడప జిల్లా దువ్వూరు మండలం చిన్నభాకరపురం గ్రామ పొలాల్లో కుక్కల దాడిలో చిరుత కూన మృతి చెందింది. రైతు పుల్లారెడ్డి పొలంలో చిరుత పిల్ల మృతి చెంది ఉండటాన్ని గుర్తించిన స్థానికులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీ శాఖ డీఆర్వో అన్వర్ హుస్సేన్ ఘటనా స్థలానికి చేరుకుని మిగతా .. 2లో..

బెంగాల్‌పై కన్నేస్తే..
పాక్‌కు రాజ్‌నాథ్ సింగ్

## స్ట్రాంగ్ వార్నింగ్



**విశ్వం వాయిస్ న్యూస్ :** పాకిస్థాన్‌కు రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. బెంగాల్‌పై కన్నేస్తే ఈసారి పాక్ ఎన్ని ముక్కలవుతుందో ఆ దేవుడికే తెలియాలంటూ హెచ్చరికలు చేశారు. భవిష్యత్తులో భారత్ ఏమైనా దాడులకు పాల్పడితే.. కోల్‌కతానూ లక్ష్యంగా చేసుకుంటామని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ఇటీవల కవ్వింపులకు పాల్పడ్డారు. ఈ వ్యాఖ్యల పైనే తాజాగా రాజ్‌నాథ్ ఘాటుగా స్పందించారు. ఓ వార్తా సంస్థతో ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యల వల్లనే 55 ఏళ్ల క్రితం పాక్ రెండుగా విడిపోయిన విషయాన్ని గుర్తుచేశారు. 1971లో జరిగిన యుద్ధంలో మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా రాయలసీమ

అనుగుణంగా భవిష్యత్తులో ఆ విద్యుత్‌ను ఇతర రాష్ట్రాలకు సరఫరా చేసేలా ట్రాన్స్ మిషన్ లైన్లను కూడా సిద్ధం చేసుకోవాలని సీఎం సూచించారు. సచివాలయంలో మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 16వ ఎస్ఐపీబీ సమావేశం రాష్ట్రంలో వివిధ రంగాల్లో పెట్టుబడి ప్రతిపాదనలకు ఆమోదం తెలియచేసింది. ఈ సమావేశానికి మంత్రులు నారాలోకేష్, కె.అచ్చెన్నాయుడు, పి.నారాయణ, కందుల దుర్గేష్, అనగాని సత్యప్రసాద్, టీజీ భరత్, గొట్టిపాటి రవికుమార్, బీసీ జనార్ధన్ రెడ్డి, వాసంశెట్టి సుభాష్ , సీఎస్ జి.సాయి ప్రసాద్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. పరిశ్రమలు, విద్యుత్, ఐటీ, పర్యాటకం, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో రూ. 39,436.84 కోట్ల విలువైన ప్రతిపాదనలకు రాష్ట్రస్థాయి పెట్టుబడుల బోర్డు ఆమోదం తెలియచేసింది. 31 ప్రాజెక్టుల ద్వారా 1,11,278 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు దక్కనున్నాయి. ప్రత్యేకించి రాయలసీమ జిల్లాల్లో సౌర విద్యుత్ ఉత్పత్తి చేసే సామర్థ్యానికి అనుగుణంగా పెట్టుబడులను ఆకర్షించాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. పస్తుతం రాష్ట్రంలో 325 గిగావాట్ల సౌరవిద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఉత్పత్తి అయిన విద్యుత్ ను స్టేట్ గ్రిడ్, సెంట్రల్ గ్రిడ్ కు కనెక్టు చేసేలా చూడాలని మంత్రి లోకేష్ సూచనలు చేశారు. దీనిపై స్పందించిన సీఎం సమీప భవిష్యత్తులో ఉత్పత్తి అయిన విద్యుత్ ను ఇతర రాష్ట్రాలకు కూడా సరఫరా చేసేలా ట్రాన్స్ మిషన్ లైన్లను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం రాజస్థాన్‌లో సౌర విద్యుత్ ఉత్పత్తి జరుగుతున్నా పూర్తి స్థాయిలో వినియోగించుకోలేని పరిస్థితి ఉందని.. ఇలాంటి పరిస్థితి తలెత్తకుండా ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎలక్ట్రానిక్స్ రంగంలో కంజ్యూమర్ ప్రొడెక్ట్స్ తయారీలో ఏపీ కీలకంగా మారాలని ముఖ్యమంత్రి సూచించారు. శ్రీసిటీ, కొప్పర్తి, అనంతపూర్ లలో ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్ పరిశ్రమలు ఏర్పాటు అయ్యేలా పెట్టుబడుల్ని ఆకర్షించాలన్నారు. రాష్ట్రంలో జీసీసీల ఏర్పాటుపై కూడా దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. ఏపీ జీసీసీలకు కేంద్రంగా మారాలన్నారు. వ్యవసాయం, ఉద్యాన, ఆక్వా కల్చర్ రంగాల్లో వస్తున్న వ్యర్ధాలను సద్వినియోగం చేసుకునేలా ప్రాజెక్టులను ఆహ్వానించాలని సీఎం స్పష్టం చేశారు. ఈ రంగాల్లో కాలుష్య కారకాలు లేకుండా ఇథనాల్ తరహా బై ప్రొడెక్టులు వచ్చేలా చూడాలని దీనికి సంబంధించిన అంశాలపై అధ్యయనం చేయాలన్నారు. దీనిపై కేంద్రం నుంచి సహకారం కూడా తీసుకోవాలని సూచించారు.

### పారిశ్రామిక ప్రాజెక్టుల్లో ఆధునిక భద్రతా ప్రమాణాలు

రాష్ట్రంలో వివిధ పెట్టుబడి ప్రతిపాదనతో వస్తున్న పరిశ్రమల్లో ఆధునిక భద్రతా ప్రమాణాలను ఏర్పాటు చేసుకోవటం పై కూడా దృష్టి సారించాలని ముఖ్యమంత్రి సూచించారు. భవిష్యత్తులో ఉత్పన్నమయ్యే ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోనేలా ఈ సేఫ్టీ స్టాండర్డ్స్ ను నిర్దేశించాలన్నారు. ఫార్మా, స్టీల్, గ్రీన్ ఎనర్జీ, బీఈఎస్ లాంటి ప్రాజెక్టులు ఏర్పాటు అవుతున్న నేపథ్యంలో భద్రతా ప్రమాణాలపై ప్రత్యేకంగా ఓ ఎస్ఓపీని సిద్ధం చేయాలని సూచించారు. డిజాస్టర్ మేనేజ్మెంట్ నిబంధనలకు అనుగుణంగా ఈ భద్రతా ప్రమాణాలను పారిశ్రామిక యూనిట్లు కలిగి ఉండాలని తేల్చి చెప్పారు. ఇటీవల రాష్ట్రంలోని బాణా సంచా తయారీ యూనిట్లలో జరిగిన ప్రమాదాల నేపథ్యంలో ప్రత్యేకంగా జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. బాణా సంచా తయారీ యూనిట్లు, మిల్క్ డెయిరీలు లాంటి అంశాల్లో ఉల్లంఘనలు లేకుండా ప్రామాణిక విధానాలు జారీ చేయాలని సూచించారు. నిర్దేశిత ప్రమాణాలను పాటించే విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అమరావతి క్వాంటం టవర్స్ ను త్వరితగతిన పూర్తి అయ్యేలా చూడాలని సీఎం స్పష్టం చేశారు. భూములు కేటాయించిన పర్యాటక ప్రాజెక్టులు నిర్దేశిత గడువులోగా కార్యకలాపాలు ప్రారంభించేలా చూడాలని.. ఈ విషయంలో ఎలాంటి మినహాయింపు లేదన్నారు.

### వేగంగా ప్రాజెక్టులు గ్రౌండింగ్

రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డులో ఆమోదం పొందిన ప్రాజెక్టులు త్వరితగతిన ప్రారంభం అయ్యేలా చూడాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. వీటితో పాటు భాగస్వామ్య సదస్సులో కుదుర్చుకున్న ఒప్పందాలు కూడా సాకారమయ్యేలా చర్యలు చేపట్టాలని ప్రత్యేకించి ఆయా ప్రభుత్వ శాఖలు వీటిపై దృష్టి పెట్టాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా ఆయా ప్రాజెక్టులు గ్రౌండ్ అయ్యేలా చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. భారీ ప్రాజెక్టులపై ప్రతీ ఎస్ఐపీబీ సమావేశంలోనూ సమీక్షిద్దామని సీఎం స్పష్టం చేశారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఉత్పత్తి సామర్ధ్యం పెరగాలన్నారు. పామాయిల్, కోకో లాంటి ఉద్యాన ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించేలా చూడాలని సీఎం సూచించారు. ఉద్యాన ఉత్పత్తులు 200 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 400 లక్షల మెట్రిక్ టన్నులకు పెరగాలని అన్నారు. దీనికి తగినట్టుగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు కూడా పెరిగితే రైతులకు ప్రయోజనం చేకూరుతుందని స్పష్టం చేశారు. ప్రాడెక్టు పర్ఫెక్షన్ పై కూడా దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంఎస్ఎంఈ పార్కుల్లో పారిశ్రామిక యూనిట్ల ఏర్పాటు వేగంగా జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలో ఏర్పాటు అవుతున్న ప్రాజెక్టులు, పెట్టుబడులు, ఉద్యోగాల కల్పన వివరాలను వెబ్ సైట్ లో పొందుపరచాలని సీఎం సూచించారు. తాజాగా 16వ ఎస్ఐపీబీ సమావేశం ఆమోదించిన పెట్టుబడులతో కలిపి రాష్ట్రంలో గడచిన 22 నెలల్లో ఇప్పటి వరకు 264 ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. వీటి ద్వారా రూ.9.36 లక్షల కోట్ల పెట్టుబడులు, 9.60 లక్షల మందికి ఉద్యోగాలు దక్కనున్నాయి. విశాఖలో జరిగిన భాగస్వామ్య సదస్సు ద్వారా 538 ఎంఓయూలకు గానూ రూ.11.38 లక్షల పెట్టుబడులు, 13.95 లక్షల మందికి ఉద్యోగాలు రానున్నాయి. మొత్తంగా 802 ప్రాజెక్టుల ద్వారా రూ.20.74 లక్షల కోట్ల పెట్టుబడులు, 23.55 లక్షల ఉద్యోగాల కల్పన జరుగనుంది.

### 16వ ఎస్ఐపీబీలో ఆమోదం పొందిన పెట్టుబడులు :

మొత్తం ప్రాజెక్టులు: 31
మొత్తం పెట్టుబడి విలువ: రూ.39,436.84 కోట్లు
మొత్తం ఉద్యోగాలు: 1,11,278

విద్యుత్ రంగం : మొత్తం 8 పెట్టుబడులు - రూ.12,552 కోట్ల పెట్టుబడులు, 69,070 ఉద్యోగాలు

1. క్లీన్ రెన్యువబుల్ ఎనర్జీ హైబ్రిడ్ సిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ - కడప, అనంతపురం జిల్లాలు - రూ.1,391 కోట్ల పెట్టుబడి - 190 ఉద్యోగాలు
2. క్లీన్ రెన్యువబుల్ ఎనర్జీ హైబ్రిడ్ సిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ - కడప జిల్లా రూ.1,391 కోట్ల పెట్టుబడి - 190 ఉద్యోగాలు
3. ఎస్సార్ రెన్యువబుల్స్ సోలార్ టు లిమిటెడ్ - కర్నూలు జిల్లా - రూ.1,327 కోట్ల పెట్టుబడి - 1,035 ఉద్యోగాలు
4. ఎస్సార్ రెన్యువబుల్స్ హైబ్రిడ్ వన్ లిమిటెడ్ - కర్నూలు జిల్లా - రూ.2,714 కోట్ల పెట్టుబడి - 1,240 ఉద్యోగాలు
5. ఎస్సార్ రెన్యువబుల్స్ హైబ్రిడ్ వన్ లిమిటెడ్ - అనంతపురం జిల్లా - రూ.1,714 కోట్ల పెట్టుబడి - 220 ఉద్యోగాలు
6. పేస్ డిజిటెక్ ప్రైవేట్ లిమిటెడ్ - కడప జిల్లా - రూ.745 కోట్ల పెట్టుబడి - 345 ఉద్యోగాలు
7. ఎస్ఏఈఎల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ - పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, కృష్ణా, గుంటూరు, బాపట్ల, ఏలూరు, విజయనగరం జిల్లాలు - రూ.3,200 కోట్ల పెట్టుబడి - 65,000 ఉద్యోగాలు
8. హెచ్‌హెచ్‌పీ ఎయిట్ ప్రైవేట్ లిమిటెడ్ - తిరుపతి జిల్లా - రూ.70 కోట్ల పెట్టుబడి - 850 ఉద్యోగాలు

ఐటీ, ఈ అండ్ సీ : మొత్తం 11 పెట్టుబడులు - రూ.18,210.36 కోట్ల పెట్టుబడులు, 36,411 ఉద్యోగాలు

9. ఇన్ఫోసిస్ లిమిటెడ్ - యండాడ, విశాఖపట్నం - రూ.750 కోట్ల పెట్టుబడి - 7,000 ఉద్యోగాలు
10. క్రెడెన్స్ రియాలిటీ - తాళ్లవలస, విశాఖపట్నం - రూ.386.88 కోట్ల పెట్టుబడి - 6,500 ఉద్యోగాలు
11. ఫ్యూజీ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ - కాపులుప్పాడ, విశాఖపట్నం - రూ.425 కోట్ల పెట్టుబడి - 2,500 ఉద్యోగాలు
12. శ్రీటెక్ డేటా లిమిటెడ్ - కాపులుప్పాడ, విశాఖపట్నం - రూ.1,800 కోట్ల పెట్టుబడి
13. పీజీ టెక్నోప్లాస్ట్ ప్రైవేట్ లిమిటెడ్ - శ్రీసిటీ, తిరుపతి జిల్లా - రూ.1,305 కోట్ల పెట్టుబడి, 2,910 ఉద్యోగాలు
14. ఎన్‌పీఎస్‌పీఎల్ స్పెషాలిటీ కెమికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ - కుప్పం, చిత్తూరు జిల్లా -రూ.2,550 కోట్ల పెట్టుబడి - 400 ఉద్యోగాలు
15. ఐస్ప్రౌట్ బిజినెస్ సెంటర్ ప్రైవేట్ లిమిటెడ్ - విశాఖపట్నం - రూ.626.90 కోట్లు పెట్టుబడి - 12,500 ఉద్యోగాలు
16. ఆర్ఆర్‌పీ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ - శ్రీ సత్య సాయి జిల్లా - రూ.10,239.78 కోట్ల పెట్టుబడులు - 3,017 ఉద్యోగాలు
17. సీ డాక్ - అమరావతి క్వాంటం వ్యాలీ - రూ.17 కోట్ల పెట్టుబడి - 12 ఉద్యోగాలు
18. పీక్యూ స్టేషన్ ప్రైవేట్ లిమిటెడ్ - అమరావతి క్వాంటం వ్యాలీ - రూ.1.8 కోట్ల పెట్టుబడి - 20 ఉద్యోగాలు
19. క్వాంటం ఏఐ గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్ - అమరావతి క్వాంటం వ్యాలీ - రూ.108 కోట్ల పెట్టుబడి - 1,552 ఉద్యోగాలు

పర్యాటక రంగం : మొత్తం 2 పెట్టుబడులు - రూ.200.15 కోట్ల పెట్టుబడులు, 270 ఉద్యోగాలు

20. సన్ రే గ్రీన్ స్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ - విజయనగరం -రూ.117.66 కోట్ల పెట్టుబడి - 150 ఉద్యోగాలు
21. రవిప్రియ హాస్పిటాలిటీస్ ఎల్ఎల్‌పీ - ఒంగోలు - రూ.82.49 కోట్ల పెట్టుబడి - 120 ఉద్యోగాలు

ఫుడ్ ప్రాసెసింగ్ : మొత్తం 2 పెట్టుబడులు - రూ.1,222.73 కోట్ల పెట్టుబడులు, 550 ఉద్యోగాలు

22. ఇండస్ కాఫీ ప్రైవేట్ లిమిటెడ్ - తిరుపతి -రూ.233.73 కోట్ల పెట్టుబడి - 100 ఉద్యోగాలు
23. రెడ్ బెర్రీ ఫుడ్ లాజిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ - చిత్తూరు - రూ.989 కోట్ల పెట్టుబడి - 450 ఉద్యోగాలు

ఇండస్ట్రీస్, కామర్స్ : మొత్తం 8 పెట్టుబడులు - రూ.7,251.6 కోట్ల పెట్టుబడులు, 4,977 ఉద్యోగాలు

24. మెట్రో డెకరేటివ్ లిమిటెడ్ - నాయుడుపేట - రూ.1,032 కోట్ల పెట్టుబడి - 400 ఉద్యోగాలు
25. ఆర్సెల్లార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా లిమిటెడ్ పెల్లెట్ ప్లాంట్ 3 - విశాఖపట్నం - రూ.1,400 కోట్ల పెట్టుబడి - 250 ఉద్యోగాలు
26. శ్యామ్ మెటాలిక్స్ అండ్ ఎనర్జీ లిమిటెడ్ - ఎస్పీఎస్సార్ నెల్లూరు - రూ.3,678 కోట్ల పెట్టుబడి - 3,200 ఉద్యోగాలు
27. బాల్ బెవరేజెస్ ప్యాకేజింగ్ ప్రైవేట్ లిమిటెడ్ - శ్రీసిటీ - రూ.633 కోట్ల పెట్టుబడి - 117 ఉద్యోగాలు
28. సానోఫ్ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ - ఏలూరు - రూ.80 కోట్ల పెట్టుబడి - 210 ఉద్యోగాలు
29. ఆర్ఎస్‌బీ ట్రాన్స్మిషన్ లిమిటెడ్ - శ్రీసిటీ - రూ.143.99 కోట్ల పెట్టుబడి - 350 ఉద్యోగాలు
30. వెంకటేశ్వర పేపర్ ప్రోడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ - కృష్ణా -రూ.63.61 కోట్ల పెట్టుబడి - 100 ఉద్యోగాలు
31. అనాడ్రోన్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ -- ఎస్పీఎస్సార్ నెల్లూరు - రూ.221 కోట్ల పెట్టుబడి - 350 ఉద్యోగాలు

# భారత్ ధర్మసత్రం కాదు

అమిత్ షా పేర్కొన్నారు. "కాంగ్రెస్ నేతలకు అసలు ప్రజల కష్టాలు తెలుసుకోవాలనే ఉద్దేశం ఉండదు. నిరసనకారులను మెచ్చుకుంటూ రాహుల్ గాంధీ వ్యాఖ్యలు చేశారు. దీంతో ఆ పార్టీ ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు" అని పేర్కొన్నారు.

# కేంద్రం గ్రీన్ సిగ్నల్

చేయడానికి కేంద్ర ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుకు అవసరమైన భూమి, ప్రాథమిక మౌలిక సదుపాయాలను రాష్ట్ర ప్రభుత్వం అందించాలని కేంద్ర మత్స్య శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ లేఖ ద్వారా తెలియజేశారని మంత్రి వెల్లడించారు. దేశంలో ఆక్వాకల్చర్ రంగంలో అగ్రగామి రాష్ట్రంగా నిలిచిన ఆంధ్రప్రదేశ్‌కు ఇది కీలక ముందడుగు అని, రాష్ట్ర మత్స్యరంగ అభివృద్ధికి ప్రధాన కేంద్రంగా మారనుందని తెలిపారు. మత్స్యకారులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నూతన సాగు పద్ధతులు, నాణ్యమైన విత్తనాలు, ఫీడ్ మేనేజ్‌మెంట్, వ్యాధి నియంత్రణపై శిక్షణలు స్థానికంగా అందుబాటులోకి రానున్నాయి. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఆర్థిక సహాయం వేగవంతంగా చేరేలా సహకరిస్తుంది. ప్రాసెసింగ్, నిల్వ, రవాణా, ఎగుమతుల రంగాల్లో సాంకేతిక మద్దతు లభించడం ద్వారా మత్స్య ఉత్పత్తుల నాణ్యత మెరుగుపడుతుంది. మార్కెటింగ్ అవకాశాలు విస్తరించడంతో దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానం బలపడుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరిగి, యువతకు కొత్త ఉపాధి మార్గాలు అందుబాటులోకి వస్తాయని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

# ఈ ప్రకటనలతో జాగ్రత్త

సజ్జనార్ విజ్ఞప్తి చేశారు. ఈ తరహా ప్రమోషన్ల విషయంలో హైదరాబాద్ సైబర్ క్రైం విభాగం కఠినంగా వ్యవహరిస్తోందని తెలిపారు. గత నెల రోజుల వ్యవధిలో 494 పెయిడ్ ప్రకటనలు, వాటిని ప్రచారం చేస్తున్న 129 సోషల్ మీడియా ప్రొఫైల్స్‌ని బ్లాక్ చేయించినట్లు వెల్లడించారు. ఈ నిఘా నిరంతరం కొనసాగుతుందని, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని సజ్జనార్ హెచ్చరించారు. ఇలాంటి మోసపూరిత యాడ్స్ మీ దృష్టికి వచ్చినా, లేదా మీరు మోసపోయినా వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయాలని లేదా http://cybercrime.gov.in వెబ్‌సైట్‌లోనూ ఫిర్యాదు చేయొచ్చన్నారు.

# భారత్‌పై విషం కక్కి

తీవ్ర నష్టాన్ని చవిచూస్తోంది. దీంతో గతంలో పాక్‌కు ఇచ్చిన 3.5 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.32 వేల కోట్లు) రుణాన్ని తిరిగి చెల్లించాల్సిందిగా ఆ దేశం ఇటీవల ఇస్లామాబాద్‌ను కోరింది. ఇప్పటివరకు యూఏఈ వద్ద తాము అప్పుగా తీసుకొన్న డబ్బు తిరిగి చెల్లిస్తామని పాక్ వెల్లడించింది. మార్చి 27 నాటికి పాక్ వద్ద 16.4 బిలియన్ డాలర్ల విదేశీ మారక నిల్వలు ఉన్నాయి. యూఏఈకి చెల్లించాల్సిన అప్పు మొత్తం ఆ దేశ విదేశీ మారక నిల్వల్లో సుమారు 18 శాతానికి సమానం. దీంతో పాకిస్థాన్ మరిన్ని ఆర్థిక సమస్యలు ఎదుర్కొనే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఆ దేశ సెనెటర్ యూఏఈపై ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

# స్ట్రాంగ్ వార్నింగ్

పాకిస్థాన్ నుంచి విడిపోయి బంగ్లాదేశ్ స్వతంత్రదేశంగా ఏర్పడింది. నాడు బంగ్లా విముక్తి పోరాటానికి భారత సైన్యం అండగా నిలిచింది. ఉద్రిక్తతలను పెంచే ప్రకటనలు చేయవద్దని ఇస్లామాబాద్‌ను ఆయన హెచ్చరించారు. వారు బెంగాల్‌పై కన్నేస్తే.. ఈసారి పాక్ ఎన్ని ముక్కలవుతుందో ఆ దేవుడికే తెలియాలి అని వ్యాఖ్యానించారు.

# దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ అరెస్టు

గుర్తించారు. విశాఖ ఎండాడలో లగ్జరీ ఫ్లాట్, తాడేపల్లి కుంచనపల్లిలో జీం2 భవనంతోపాటు 770 గ్రాముల బంగారు నగలు, 3 కిలోల వెండి గుర్తించారు. అంతేకాకుండా రూ.1.15 లక్షల నగదు, బ్యాంకు ఖాతాల్లో మరో రూ.3 లక్షలు ఉన్నట్లు తేల్చారు. వీటితోపాటు ఓ కారు, ద్విచక్ర వాహనం గుర్తించారు. అక్రమాల ఆరోపణలతో 2024 జులై నుంచి 2026 మార్చి వరకు శాంతి సస్పెన్షన్‌లో ఉన్నారు.

# ఈ రాత్రితో ఇరాన్ నాగరికత అంతం..

తెలివైన నాయకత్వం వచ్చిందని, దాని వల్ల అద్భుతాలు జరిగే అవకాశం కూడా ఉందన్నారు. మరికొన్ని గంటల్లో ఇరాన్ హర్మూజ్‌ను తెరవకపోతే ఆ దేశంలోని ఇరాన్‌లో వంతెనలు, విద్యుత్కేంద్రాలను లక్ష్యం చేసుకుంటామని సోమవారం ట్రంప్ హెచ్చరించిన విషయం తెలిసిందే. అయినప్పటికీ అమెరికా ప్రతిపాదనలను ఇరాన్ తిరస్కరించడంతో.. ట్రంప్ తాజాగా మరోసారి హెచ్చరికలు చేశారు. ఇరాన్‌లోని పౌర, మౌలిక సదుపాయాలపై దాడులు చేస్తే.. అంతర్జాతీయ నేరంగా పరిగణిస్తామని ఐక్యరాజ్య సమితి చీఫ్ ఆంటోనియో గుటెరస్ హెచ్చరించినప్పటికీ అమెరికా దాడులు కొనసాగిస్తోంది.

### 50 లక్ష్యాలపై దాడులు..

ఇరాన్‌లోని ఖర్గ్ ఐలాండ్‌లో ఉన్న దాదాపు 50 లక్ష్యాలపై తమ దళాలు దాడులు జరిపినట్లు అమెరికా వెల్లడించింది. అక్కడి రక్షణ వ్యవస్థలపై కూడా దాడులు చేసినట్లు తెలిపింది. ఈ ద్వీపాన్ని స్వాధీనం చేసుకోవడానికి మెరైన్‌లతో ఆపరేషన్ చేపట్టడానికి అగ్రరాజ్యం యోచిస్తున్నట్లు సమాచారం. ఇరాన్‌లోని పలు ప్రాంతాల్లోనూ అమెరికా-ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నాయి.

### ఇరాన్ దెబ్బ రుచి చూస్తారు

ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ స్పందించింది. ఈ రాత్రికి ఇరాన్ నాగరికత తుడిచి పెట్టుకోబోతోందంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను తిప్పికొట్టింది. అమెరికా, దాని మిత్రదేశాలే పురాతన నాగరికత కలిగిన ఇరాన్ నుంచి మరిచిపోలేని దెబ్బను రుచి చూస్తారంటూ పేర్కొంది. ఈ మేరకు దక్షిణ ఆఫ్రికాలోని ఇరాన్ ఎంబసీ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టింది.

# నాతో సహా నా దేశప్రజలు ప్రాణత్యాగానికి సిద్ధమే

స్థావరాలు, మౌలిక సదుపాయాలను లక్ష్యం చేసుకుంటామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ సారి ఎటువంటి డెడ్‌లైన్ పొడిగింపులు ఉండబోవని తేల్చిచెప్పారు. ఇరాన్‌ను తమ బలగాలు ఒక్కరాత్రిలో తుడిచి పెట్టేయగలవని.. ఆ రాత్రి మంగళవారం రాత్రే కావొచ్చనీ హెచ్చరించారు. అయినప్పటికీ అమెరికా ప్రతిపాదనలకు, తాత్కాలిక ఒప్పందాలకు అంగీకరించబోమని ఇరాన్ స్పష్టం చేసింది. దీంతో యుద్ధం ఏ క్షణాన ఏ మలుపు తీసుకుంటుందో అని పశ్చిమాసియా దేశాల్లో ఆందోళన నెలకొంది. ఈ క్రమంలో ప్రాణ త్యాగానికి కూడా సిద్ధమని ఇరాన్ అధ్యక్షుడు ప్రకటన చేయడం మరింత ఆందోళనకరంగా మారింది.

# బాంబు స్క్వాడ్ తనిఖీలు

తనిఖీ చేయడమైనది. ఈ తనిఖీలలో అమలాపురం పట్టణ సిఐ పి.వీరబాబు, ఎస్ఐ కేఎం జోషి జిల్లా బిడి టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

# జాబిల్లి కాదు.. మన వసుంధరే..

వైట్‌హౌస్ సైతం సోషల్ మీడియాలో షేర్ చేసింది. "జాబిల్లి అవతలి వైపు నుంచి తీసిన మొదటి భూమి ఫొటో ఇది" అని పేర్కొంది. ఆర్టెమిస్-2 యాత్రలో ముగ్గురు అమెరికన్లు, ఒక కెనడావాసి భాగస్వాములయ్యారు. వీళ్లంతా చందమామపై కాలు మోపకుండా.. సుదూరం నుంచే జాబిల్లిని చుట్టి వస్తున్నారు. జాబిల్లి యాత్రకు నిర్దేశించిన రాకెట్, వ్యోమనౌకలోని కీలక వ్యవస్థల పనితీరును పరిశీలించడమే ఈ మిషన్ ఉద్దేశం

కుక్కల దాడిలో

# చిరుత కూన మృతి

పరిశీలించి కుక్కలు దాడి చేయడంతోనే మృతి చెందినట్లు నిర్ధరించారు. దాని వయస్సు ఒక సంవత్సరం పైబడి ఉంటుందన్నారు. పొలాల్లో చిరుత పులుల సంచారం ఉందేమోనని రైతులు, పశువుల కాపరులు భయాందోళన చెందుతున్నారు. మృతి చెందిన చిరుత కూనకు అటవీశాఖ అధికారులు పోస్టుమార్టం నిర్వహించారు.

# జల సంరక్షణకు కట్టుబడి పని చేద్దాం

వంశధార వంటి నదులే జీవనాధారం. వ్యవసాయ ఆధారిత రాష్ట్రంగా దేశంలో ముందు వరుసలో ఉండటానికి మనకు సమృద్ధిగా ఉన్న నీటి వనరులే కారణం. అలాంటి నీటిని సంరక్షించుకునే పెద్ద సవాల్ ఇప్పుడు మన ముందుంది. ఉపరితల జలాలను జాగ్రత్తగా కాపాడుకోవడం, రానురాను తగ్గుతున్న భూగర్భ జలాలను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. దీనిపై ప్రతి ఒక్కరిలో చైతన్యం రావాలి. భవిష్యత్తును సుందరంగా నిర్మించుకోవాలంటే ప్రతి నీటి చుక్క ఎంత విలువైందో తెలుసుకోవాలి. గ్రామీణ ప్రాంతాల్లో లభ్యమయ్యే నీటి సంరక్షణ చర్యలు, వృథా అయ్యే నీటిని కాపాడుకునే చర్యలను వేగవంతం చేయడం ద్వారా భవిష్యత్తు తరాలకు మనం భరోసానిచ్చినట్లు అవుతుంది.

### గ్రామీణ నీటి సరఫరా వ్యవస్థకు ఎన్నో అవరోధాలు

ప్రతి కుటుంబానికీ తగినంత తాగు నీరు అందించాలనే ఆశయానికి క్షేత్రస్థాయిలో ఎన్నో అవరోధాలు ఉన్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో తగినంతగా - ఉపరితలంలో లభించే నీరు లభ్యత లేకపోవడం, భూగర్భ జలాలు అడుగంటిపోవడం కీలకమైన సమస్యలుగా ఉన్నాయి. లభ్యతగా ఉన్న నీరు కూడా ఎక్కువగా కాలుష్యం బారిన పడుతోంది. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరి శిఖర గ్రామాల్లో వేసవిలో నీటి సమస్యను తీర్చేందుకు వాటర్ షెడ్ల పునరుద్ధరణకు ప్రణాళికలు వేస్తున్నాం. మారుతున్న సాంకేతికను ఎప్పటికప్పుడు వినియోగించుకొని నీటి కొరత తీర్చేందుకు, నీటి సంరక్షణ చర్యలు చేపట్టేందుకు యంత్రాంగాన్ని సిద్ధం చేస్తున్నాం. ముఖ్యంగా నీటి సంరక్షణ చర్యల్లో ప్రజల భాగస్వామ్యం అవసరం.

### నీటి సంరక్షణకు ప్రాధాన్యం

ప్రతి కుటుంబానికి తగినంత తాగునీరు అందించాలనే బృహత్ సంకల్పంతో జల్ జీవన్ మిషన్ కార్యక్రమాన్ని మొదలుపెట్టిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశయానికి అనుగుణంగా ముందుకు వెళ్తాం. కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మార్గదర్శకంలో నీటి పొదుపు చర్యలు తీసుకుంటాం. జల్ జీవన్ మిషన్ 2.0 కార్యక్రమంలో భాగంగా నీటి సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తాం. నీటిని జాగ్రత్తగా వినియోగించుకునేలా, వృథా నీటిని పునర్వినియోగించుకునేలా ప్రజల్లో అవగాహన తీసుకురావడం ప్రధానం.

### 100 రోజుల ప్రణాళికకు శ్రీకారం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా "100 రోజుల నీటి వినియోగ డ్రైవ్" అనే కార్యక్రమాన్ని ఈ ఏప్రిల్ 6వ తేదీ నుంచి జూలై 14వ తేదీ వరకు చేపట్టింది. దీనిలో ప్రజల్లో చైతన్యం కలిగించి భూగర్భ జలాల పెంపుదల, నీటి వృథాను అడ్డుకోవడం, నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవడం, వర్షపు నీటిని ఒడిసి పట్టడం వంటి చర్యలను తీసుకుంది. ప్రకృతిలో మన జీవనం.. జీవితం ముడిపడి ఉందనేది భారతీయ సంస్కృతికి మూలం. ప్రకృతిని కాపాడుకుంటే, ప్రకృతి మనకు మంచి చేస్తుంది. జీవితాన్ని, ప్రకృతిని సమతుల్యం చేసుకుంటేనే భవిష్యత్తు అనేది ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి. ప్రకృతి ఇచ్చిన నీటి వనరులను ఉపయోగించుకోవడంలో జాగ్రత్త వహించాలి" అన్నారు. ఈ వర్క్ షాపులో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్, కాలుష్య నియంత్రణమండలి ఛైర్మన్ డా.పి కృష్ణయ్య, ఏపీ ఎస్ఐఆర్డీ కమిషనర్ ముత్యాల రాజు, అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఎడిటర్ వాయిస్

## విశాఖకు పల్లె బెంగ.. జడ్పీ చింత

ఏపీలో ఏ జిల్లాకూ లేని ఇబ్బంది విశాఖ జిల్లాకు ఏర్పడింది. ఇది 2022లో అప్పటికి 13గా ఉన్న జిల్లాలను 26 జిల్లాలుగా మార్చినప్పుడే గ్రామీణం అంతా చెల్లాచెదురైంది. అత్యధిక భాగం అనకాపల్లి జిల్లాకు వెళ్ళిపోయింది. దాంతో విశాఖలో పల్లె ప్రాంతాలు పంచాయతీలు మండలాలు ఏవీ అని వెతుక్కోవాల్సి వచ్చింది. అయితే నిన్నటి దాకా కొనసాగిన జిల్లా పరిషత్తు ఉమ్మడి విశాఖ జిల్లాతోనే ఉండడంతో పెద్దగా ఇబ్బంది రాలేదు.అయితే త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విశాఖ జిల్లా పరిషత్ ఉంటుందా లేదా అన్న కొత్త చర్చ అయితే స్టార్ట్ అయింది అని అంటున్నారు.

అంతా అర్బన్ ఏరియా : ఇదిలా ఉంటే విశాఖ జిల్లా 2022 దాకా ఏపీలో రెండవ పెద్ద జిల్లాగా భౌగోళికంగా ఉండేది. అలాగే సగానికి పైగా గ్రామీణ ప్రాంతం కూడా ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉండేది. అయితే జిల్లాల పునర్విభజన తరువాత చూస్తే కనుక జిల్లాలో ఏకంగా జీవీఎంసీ విస్తరించి అంతటా ఉంది. దాంతో ఏకంగా 89 శాతం దాకా పట్టణమే ఉంది. కేవలం 11 శాతం మాత్రమే గ్రామీణ ప్రాంతం ఉంది. అంటే కేవలం పది శాతం అన్న మాట. జీవీఎంసీ అయితే నానాటికీ విస్తరిస్తోంది.

బృహత్ విశాఖగా : జీవీఎంసీ అయితే చాలా పంచాయతీలను మండలాలను తనలో కలిపేసుకుంది. దాంతో ఒకనాడు 72 వార్డులు గా ఉన్న జీవీఎంసీ ఇపుడు 120 వార్డులుగా ఎదగబోతోంది. ఇంకా జీవీఎంసీని విస్తరించాలని భావించి ఆ మిగిలిన పల్లె ప్రాంతాలను పంచాయతీలను కలపాలని చూస్తున్నారు. ఎందుకంటే ఆ ప్రాంతాలోనే గూగుల్ డేటా సెంటర్ లాంటివి వచ్చాయి. దాంతో వాటికి సిటీ ఫ్లేవర్ అద్దాలన్న ఉద్దేశ్యంతో జీవీఎంసీలో విలీనం చేయాలని స్థానిక రాజకీయ నేతలు ప్రజా ప్రతినిధులు కోరుతున్నారు.

విలీనం మీద చర్చ : ఈ క్రమంలో జీవీఎంసీలో 79 గ్రామ పంచాయతీల విలీనం చేయాలని కూడా ప్రతిపాదనలు వెళ్ళాయి. అందులో విశాఖ జిల్లాలోని భీమిలి, ఆనందపురం, పద్మనాభం, పెందుర్తి మండలాల 79 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిని అన్నింటినీ జీవీఎంసీలో విలీనం చేస్తే బృహత్ విశాఖ ఆవిర్భవిస్తుందని అంటున్నారు. అయితే అసలు పల్లె ఒక్కటి కూడా విశాఖ జిల్లాలో లేకుండా పోతుందన్న ఆందోళన మరో వైపు ఉంది. ఇక చూస్తే ఈ విలీనం చేయాలంటున్న నాలుగు మండలాల్లో సుమారు నాలుగైదు లక్షల జనాభా ఉంది. వీరిని అందరినీ జీవీఎంసీలో విలీనం చేయాలని చూస్తున్నారు.

జిల్లా పరిషత్తు లేనట్లే : ఇలా విలీనం కనుక జరిగితే ఏపీలో జిల్లా పరిషత్తు లేని ఏకైక జిల్లాగా విశాఖ రికార్డు సృష్టించబోతోంది అని అంటున్నారు. అన్ని జిల్లాలకు మండలాలు పంచాయతీలు ఉంటే విశాఖ ఆ విషయంలో జీరో నంబర్ కి చేరుకుంటుంది అని అంటున్నారు. అయితే ప్రస్తుతానికి పంచాయతీల విలీనం ఆగినా 2027 జనాభా గణన తర్వాత అయినా తిరిగి ఈ డిమాండ్ వస్తుంది అని అంటున్నారు. ఒక వేళ అలా కాకుండా విడిచిపెట్టినా కేవలం నాలుగు మండలాల్తో విశాఖ జిల్లా పరిషత్తు ఏర్పాటు సాధ్యపడుతుందా అన్నది కూడా ఉంది. అతి చిన్న జిల్లా పరిషత్ గా కొనసాగిస్తారా లేదా అన్నది కూడా కొత్త చర్చగా ఉంది. చూడాలి మరి ఏమి జరుగుతుందో.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైం వాయిస్

ఉల్లిపాయలు కొనేందుకు వెళ్తే..

## స్కూటీలో రూ.5 లక్షలు చోరీ



జొన్నలగడ్డ, విశ్వం వాయిస్ న్యూస్ : పల్నాడు జిల్లా నరసారావుపేట మండలం జొన్నలగడ్డ బైపాస్ వద్ద ఆపి ఉన్న స్కూటీలో రూ.5లక్షల నగదును గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేశాడు. ఫిరంగిపురం మండలం వేములూరిపాడు గ్రామానికి చెందిన వెంకట సత్యనారాయణ అనే రైతు ఆర్థిక అవసరాల నిమిత్తం బంధువుల వద్ద రూ.5లక్షలు అప్పు చేశారు. నగదుతో తన స్వగ్రామానికి వెళ్తూ... జొన్నలగడ్డ బైపాస్ వద్ద ఉల్లిపాయలు కొనడం కోసం ఆగారు. స్కూటీని దుకాణం బయట నిలిపి లోనికి వెళ్లాడు. ఆయన బయటికి వచ్చే లోపు స్కూటీ డిక్కీలో ఉన్న రూ.5లక్షల నగదును ఓ గుర్తు తెలియని దుండగుడు చోరీ చేసి అక్కడి నుంచి ఉడాయించాడు. ఘనటకు సంబంధించిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. బాధితుడు నరసారావుపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

## పలాసలో నగల దుకాణంలో భారీ చోరీ

**పలాస, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీకాకుళం జిల్లా పలాసలోని శ్రీ వేంకటేశ్వర జ్యువెలరీలో భారీ చోరీ చోటుచేసుకుంది. ముఖానికి ముసుగులు వేసుకుని బైక్‌లపై వచ్చిన 8 మంది దుండగులు దుకాణంలోకి ప్రవేశించారు. యజమాని రామకృష్ణ చేతులకు సంకెళ్లు వేసి చోరీకి పాల్పడ్డారు. సుమారు 700 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు క్లూస్‌టీమ్‌తో రంగంలోకి దిగి దర్యాప్తు చేపట్టారు.

## పెట్రోల్ బంక్ సమీపంలో బైక్‌లో మంటలు



**నిజామాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** నిజామాబాద్ రైల్వేకమాన్ వద్ద ద్విచక్రవాహనంలో ప్రమాదవశాత్తూ మంటలు చెలరేగాయి. వాహనదారుడు బైక్ నడుపుతుండగానే ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. అప్రమత్తమైన చోదకుడు వెంటనే బైక్ పక్కను నిలిపి వేసి ఫైర్ సిబ్బందికి సమాచారం అందించాడు. ఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటల్ని అదుపుచేశారు. ఈ ఘటన పెట్రోల్ బంక్ సమీపంలోనే జరగడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి అపాయం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

## 'మా అమ్మానాన్నల్ని కాపాడండి ప్లీజ్..'

**తీవ్ర గాయాలపాలైన కుమారుడి వేడుకోలు.. స్థానికుల కంటతడి - లారీ ఢీకొని దంపతుల దుర్మరణం**

**ఇంటర్ కళాశాల వాకబు కోసం హైదరాబాద్ వస్తుండగా ప్రమాదం**



**కొణిజర్ల, విశ్వం వాయిస్ న్యూస్ :** కుమారుడి భవిష్యత్తు కోసం కోటి ఆశలతో బయల్దేరిన ఆ దంపతులకు అదే చివరి ప్రయాణమైంది. తమ వారసుడు ప్రయోజకుడై.. ఉన్నతస్థానానికి చేరుకుంటాడని కలలు కన్న వారు.. అది చూడకుండానే శాశ్వతంగా కళ్లు మూశారు. రోడ్డు ప్రమాదం వారి ప్రాణాల్ని చిదిమేయగా.. కుమారుడు సైతం తీవ్ర గాయాల పాలవడం విషాదం. ప్రమాదానికి కారకుడైన లారీ డ్రైవర్ కూడా క్షతగాత్రుడయ్యాడు. ఖమ్మం జిల్లా కొణిజర్ల సమీపంలో సోమవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. రాజమహేంద్రవరం గాదాలమ్మనగర్‌కు చెందిన ఉండమట్ల వీర్రాజు (46), వీరశైలజ (38)లు దంపతులు. వీర్రాజు ధవళేశ్వరంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. ఇటీవలే పదోతరగతి పరీక్షలు రాసిన కుమారుడు యశ్వంత్ (16)ని ఇంటర్‌లో చేర్పించే కళాశాల, ఇతర వివరాలు తెలుసుకునేందుకు హైదరాబాద్ బయలుదేరారు. వారు ప్రయాణిస్తున్న కారు కొణిజర్ల సమీపంలోని సాగర్ కాలువ వంతెనపైకి రాగానే ఎదురుగా వచ్చిన లారీ ఢీకొంది. ఇదేసమయంలో వెనక నుంచి మరో లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ వెనక చక్రాలు కారు క్యాబిన్‌పైకి దూసుకుపోగా ముందుభాగం నుజ్జునుజ్జయ్యింది. డ్రైవింగ్ సీటులో ఉన్న వీర్రాజు క్యాబిన్‌లో ఇరుక్కుపోయారు. తీవ్ర గాయాల పాలైన ముగ్గురినీ 108లో ఖమ్మం తరలించగా.. చికిత్స పొందుతూ వీర్రాజు, వీరశైలజలు మృతి చెందారు. కారుని ఎదురుగా ఢీకొని ప్రమాదానికి కారణమైన లారీడ్రైవర్ శ్రీను కూడా క్యాబిన్‌లో ఇరుక్కుపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. మృతుల కుటుంబీకుల ఫిర్యాదు మేరకు ఎస్సై సూరజ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తీవ్ర గాయాలతో ఉన్న యశ్వంత్ 'అమ్మానాన్నల్ని కాపాడండి ప్లీజ్' అంటూ ఆర్తనాదాలు చేసిన దృశ్యం అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. కాలువ వంతెనపై ప్రమాదం జరగడంతో పాటు లారీ అడ్డుగా నిలిచిపోవడంతో మూడు కిలోమీటర్ల మేర రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసులు క్రేన్ సాయంతో వాహనాలను పక్కకు తొలగించారు.

## మన్యం జిల్లాలో బియ్యం లారీ బోల్తా



**పార్వతీపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండలం ఘాట్ రోడ్డు కంకణపల్లి సమీపంలో బియ్యం లోడుతో వెళ్తున్న లారీ బోల్తా పడింది. ఒడిస్సా నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న లారీ సోమవారం రాత్రి 11గంటల సమయంలో ప్రమాదానికి గురైంది. వాహనం రోడ్డుపై అడ్డుగా పడిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. క్రేన్ సహాయంలో పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో సాలూరు సీఐ రామకృష్ణ బియ్యం బస్తాలనో మోస్తూ సిబ్బందికి సాయపడ్డారు.

## కాసులాబాద్ అడవుల్లో కార్చిచ్చు

**సిద్ధిపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం కాసులాబాద్, దుబ్బాక, హబ్సిపూర్ గ్రామాల మధ్య ఉన్న అటవీ ప్రాంతంలో కార్చిచ్చు చెలరేగింది. మంగళవారం అడవిలో ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురయ్యారు. అడవి నుంచి పొగలు రావడాన్ని గమనించి అగ్నిమాపక, అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటల్ని అదుపు చేశారు.

మూడు రోజుల క్రితం బిర్యానీ..

## హోటల్ ఫ్రిడ్జ్‌లో 80 ప్యాకెట్లు



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** హైదరాబాద్ బంజారాహిల్స్‌లో నిల్వ చేసిన బిర్యానీని ఆన్‌లైన్ ద్వారా విక్రయిస్తూ కొందరు వ్యక్తులు సొమ్ము చేసుకుంటున్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం.2లో నివసిస్తున్న ఓ వ్యక్తి 'లక్కీ బిర్యానీ షవర్మ' అనే హోటల్ నుంచి ఆన్‌లైన్‌లో బిర్యానీ ఆర్డర్ చేశాడు. ప్యాకెట్ తెరవగానే దుర్వాసన రావడంతో అది కుళ్లిపోయిందని గుర్తించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫుడ్ సేఫ్టీ అధికారులతో కలిసి పోలీసులు సంబంధిత హోటల్‌లో తనిఖీలు నిర్వహించగా విస్తుపోయే విషయాలు వెలుగుచూశాయి. ఫ్రిడ్జ్‌లో నిల్వ ఉంచిన 80 బిర్యానీ ప్యాకెట్లను గుర్తించారు. జీడిమెట్లలో ఉన్న యజమాని ఇర్ఫాన్.. మూడు రోజుల క్రితం తయారుచేసిన బిర్యానీని ప్యాకెట్లుగా సిద్ధం చేసి, బంజారాహిల్స్ అవుట్‌లెట్‌లో నిల్వ ఉంచి, ఆర్డర్ వచ్చినప్పుడు వేడి చేసి పంపిస్తున్నట్లు పోలీసులు నిర్ధారించారు. అతడిపై కేసు నమోదు చేశారు.

## చంపుతా..చంపుతా.. అంటూనే చంపేశారు



**పహాడీషరీఫ్, విశ్వం వాయిస్ న్యూస్ :** హత్య చేస్తానంటూ హెచ్చరిస్తున్న మిత్రుడిని అతని స్నేహితులే కత్తులతో పొడిచి దారుణంగా హతమార్చారు. రంగారెడ్డి జిల్లా బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ తెలిపిన ప్రకారం... జల్‌పల్లి షాహిన్‌నగర్‌లోని వాది-ఎ-సాలిహీన్ బస్తీలో ఉండే మొహ్మద్ సలీం కుమారుడు మొహ్మద్ నసీర్(22) ఎలక్ట్రీషియన్. నిత్యం కత్తి పట్టుకుని తిరుగుతూ.. మిత్రులతో గొడవ పడేవాడు. తనకు డబ్బులు అవసరమైనప్పుడు ఇవ్వాలని.. లేదంటే మిమ్మల్ని అంతమొందిస్తానని స్థానికులను బెదిరించేవాడు. చాలాకాలంగా అతనిలో మార్పు రాకపోవడంతో స్నేహితులైన మొహ్మద్ దస్తగీర్, సుభానుద్దీన్‌లు ఆదివారం అర్ధరాత్రి మద్యం తాగేందుకు అతన్ని ఇంటి నుంచి సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలోకి తీసుకెళ్లారు. వారికి మరో ఇద్దరు స్నేహితులు మొహ్మద్ ఇలియాస్, నదీమ్‌ఖాన్ కలిశారు. ఐదుగురు కలిసి అతిగా మద్యం తాగారు. 'మమ్మల్నే నిత్యం చంపుతామని బెదిరిస్తూ డబ్బులు వసూలు చేస్తావా' అంటూ... ఆ నలుగురు కలిసి కత్తులతో విచక్షణా రహితంగా నసీర్‌ను పొడిచి హతమార్చి పరారయ్యారు. సోమవారం ఓ బాలుడు నసీర్ మృతదేహాన్ని గుర్తించి వారి కుటుంబసభ్యులకు సమాచారం అందించాడు. నిందితులను గుర్తించామని వారిని అదుపులోకి తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ చెప్పారు.

# హెల్త్ వాయిస్

## వందేళ్ళ జీవితానికి చక్కటి ఆరోగ్య సూత్రాలు!



ఒకప్పుడు ప్రజల జీవనశైలి ఏ విధంగా ఉండేదో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఒళ్ళువంచి పని చేయడమే కాకుండా ఆరోగ్యకరమైన ఆహారాన్ని స్వయంగా పండించుకొని మరీ తినేవారు. కానీ కాలం మారుతున్న కొద్దీ పెరుగుతున్న టెక్నాలజీ పరంగా ఈ మధ్యకాలంలో అన్ని యంత్రాల పైనే ఆధారపడ్డారు. ఒకరకంగా చెప్పాలి అంటే ఈ మధ్యకాలంలో పని చేసేవారు చాలా తక్కువే అని చెప్పాలి.. ఏ చిన్న పని చేయాలి అన్నా సరే యంత్రాలపైన ఆధారపడుతున్నారు. అటు ఆహారం విషయంలో కూడా మందులతో పండించిన ఆహారాలు తినడం వల్ల ఆరోగ్యం దెబ్బతింటుంది. దీనికి తోడు అధిక ఒత్తిడి, శారీరక శ్రమ లేకపోవడంతో మరెన్నో కారణాలవల్ల గుండెపోటు, మధుమేహం తోపాటు ఇతర అనారోగ్య సమస్యలు కూడా చుట్టూ ముడుతున్నాయి. అలా వందేళ్లు జీవించాల్సిన వ్యక్తులు 50 ఏళ్లు కూడా ఆరోగ్యంగా జీవించలేకపోతూ ఉండడం ఆశ్చ ర్యకరమనే చెప్పాలి. నిజానికి ఒకప్పుడు మన ఇండియాలోనే వందేళ్లకు పైగా జీవించిన వ్యక్తులు ఉన్నారు. కానీ ఇప్పుడు చూస్తే మాత్రం సగటు వ్యక్తి జీవితకాలం 50 కూడా ఉండడం లేదు అనేది వాస్తవం. అయితే ఆరోగ్యకరమైన జీవితాన్ని కొనసాగిస్తూ వందేళ్ల జీవితం పొందాలి అంటే కచ్చితంగా కొన్ని ఆరోగ్య సూత్రాలు పాటించాలని చెబుతున్నారు జపాన్ ప్రజలు. ఇక్కడ మరో ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. ప్రపంచవ్యాప్తంగా వందేళ్లకు పైగా జీవిస్తున్న వారు ఎక్కడ ఉన్నారని ఆరా తీయగా.. జపాన్లోని ఒకినావా ప్రదేశం మొదటి స్థానంలో నిలిచింది. ఆ తర్వాత ఇటలీలోని సార్డీనియా, గ్రీస్‌లోని ఇకారియా, కోస్టారికాలోని నికోయా ప్రాంతాలు ఉన్నాయి.. వీటన్నింటినీ కూడా బ్లూ జోన్స్‌గా పిలుస్తున్నారు. అంటే దీర్ఘకాలిక జబ్బులు ఏమీ లేకుండా వందేళ్లపాటు జీవిస్తున్న వారు ఉండే ప్రాంతాలని బ్లూ జోన్స్ అని పిలుస్తారు. ఇక్కడ ఉండేవారి దృష్టి ఆరోగ్యంపై కాకుండా జీవన నాణ్యత పై ఉంటుంది. వీరెవరు కూడా క్యాలరీలు లెక్కించుకొని తినరు. పదేపదే ఆహారపు అలవాట్లు, పద్ధతులను కూడా మార్చుకోరు. ఈరోజు ఏం తిందాం అని ఆలోచించకుండా ఆయా సమయాలలో స్థానికంగా దొరికే పదార్థాలను తీసుకుంటూ కడుపు నిండేలోపు తిండి ఆపేస్తారు. నూరేళ్లపాటు జీవించడానికి ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు జీవనశైలిపై దృష్టి పెడతారు. కాబట్టి ఈ ఆరోగ్యం వారి సొంతం అయ్యింది పని నిపుణులు సైతం తెలియజేస్తున్నారు. మనిషి ఆరోగ్యంగా జీవించాలి అంటే మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలి.ఆహ్లాదకరమైన జీవితాన్ని గడపడానికి ప్రయత్నం చేయాలి. ఆహారంపై దృష్టి పెట్టకుండా జీవన శైలిపై దృష్టి పెడితే ఇది సాధ్యమవుతుందని నిపుణులు చెబుతున్నారు.

## స్కూలు పిల్లల లంచ్ బాక్స్‌లో ఏమిటీ దారుణం...

అవును... తాజాగా వైరల్ అవుతున్న ఓ వీడియోలో స్కూలు పిల్లల లంచ్ బాక్సులో... ఇనిస్టంట్ నూడుల్స్ వంటి వంటకాలతో పాటు బంగాళాదుంప చిప్స్, చీజ్ బాల్స్ వంటి ప్యాక్ చేసిన స్నాక్స్ ను కలిగి ఉన్నారు. ఇటీవల కాలంలో పిల్లల్లో ఫిట్ నెస్ పోవడానికి, మానసిక ఎదుగుదలలో పెను మార్పులు సంభవించడానికి, వయసు పెరిగే కొద్దీ వారి శారీరక ఆరోగ్యాన్ని ప్రభావితం చేయడానికి, చిన్న వయసులోనే బీపీ, షుగర్ వంటి వ్యాదుల బారిన పడటానికి, ఊబకాయానికి గురవ్వడానికి.. శారీరక శ్రమ లేకపోవడం ఎంత కారణమో.. అంతకంటే ఎక్కువగా ఆహారపు అలవాట్లు అంతకంటే ఎక్కువ కారణం అనే చర్చ జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ సమయంలో ఓ వీడియో నెట్టింట వైరల్ గా మారింది. అవును... తాజాగా వైరల్ అవుతున్న ఓ వీడియోలో స్కూలు పిల్లల లంచ్ బాక్సులో... ఇనిస్టంట్ నూడుల్స్ వంటి వంటకాలతో పాటు బంగాళాదుంప చిప్స్, చీజ్ బాల్స్ వంటి ప్యాక్ చేసిన స్నాక్స్ ను కలిగి ఉన్నారు. వారిలో ఇద్దరు విద్యార్థులు మాత్రమే బ్రెడ్ - ఆమ్లెట్, రోటీ - సబ్జీని కలిగి ఉన్నారు. ఈ నేపథ్యంలో దీనికి సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. ఈ తరహా ఆహారాన్ని లంచ్ బాక్స్ లో పెట్టిపంపడం వెనుక పిల్లల ఒత్తిడా, తల్లితండ్రుల సమయాభావమా అనే చర్చ మొదలైంది! సాధారణంగా... ఇనిస్టంట్ నూడుల్స్, ప్యాక్ చేసిన స్నాక్స్, ఫ్లేవర్డ్ బ్రెడ్లు, రెడీ-టు-ఈట్ ఫుడ్స్ వంటి వాటిని పిల్లలు విస్తృతంగా ఇష్టపడతారనే అనుకోవచ్చు. పైగా.. ఉదయం పూట బాక్స్ లు సిద్ధం చేయడానికి ఇది త్వరిత పరిష్కారం కూడా కావొచ్చు.. అందుకే చాలా లంచ్ బాక్స్ లలో ఇవి శాశ్వత స్థానాన్ని సంపాదించుకుంటుంటాయని చెబుతారు. ఇలాంటి ఆహారం పిల్లల సరదా కోసమో, ఆనందం కోసమో అప్పుడప్పుడూ పెట్టొచ్చు కానీ.. డైలీ ఈ తరహా ఆహారం మంచిది కాదని అంటున్నారు! జంక్ ఫుడ్ పై క్రమం తప్పకుండా ఆధారపడటం పిల్లల ఆరోగ్యాన్ని అనేక విధాలుగా ప్రభావితం చేస్తుందని..



ఇనిస్టంట్ నూడుల్స్, ప్యాక్ చేసిన స్నాక్స్ లో సోడియం, అనారోగ్యకరమైన కొవ్వులు ఎక్కువగా ఉంటాయని.. ఇదే సమయంలో.. ఫైబర్, ప్రోటీన్, అవసరమైన సూక్ష్మపోషకాలు తక్కువగా ఉంటాయని చెబుతున్నారు. ఈ అసమతుల్యత తరచుగా ఆకలి, సరిపడా ఎనర్జీ లేకపోవడంతో పాటు పేలవమైన ఏకాగ్రతకు దోహదం చేస్తుందని చెబుతున్నారు. వీటి స్థానంలో కాస్త పక్కాగా ప్లాన్ చేసుకుని... చూడటానికి పిల్లలు ఇష్టపడే ఫుడ్ లుక్ లోనే ఉంటూ, మరింత కలర్ ఫుల్ గా ఉండే ఆహార పదార్థాలను ప్లాన్ చేసుకోవాలని పలువురు సూచిస్తున్నారు. ఇందులో భాగంగా... వెజిటబుల్ పరాఠాలు, పనీర్ లేదా వెజ్ రోల్స్, చనా చాట్, చట్నీతో ఇండ్లీ లేదా ఉతప్పం, ఉడికించిన గుడ్లు లేదా ఆంలెట్, ఫ్రూట్ చాట్ వంటి వాటిని ఎంపిక చేసుకోవచ్చని సూచిస్తున్నారు. ఇది పిల్లల మానసిక, శారీరక ఎదుగుదలకు చాలా ముఖ్యమని అంటున్నారు!

గోదావరి పుష్కరాల అభివృద్ధి పనులపై

## అఖిల పక్ష సమావేశం నిర్వహించాలి

**జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులకు సిపిఎం డిమాండ్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** 2027లో జరగబోయే గోదావరి పుష్కరాల అభివృద్ధి పనుల పైన అఖిల పక్ష సమావేశం నిర్వహించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి టి అరుణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 2027 లో గోదావరికి జరిగేటటువంటి మహా పుష్కరాలకు సంబంధించి గత ఏడాది కాలంగా జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమీక్షల మీద సమీక్షలు. నిర్వహిస్తా ఉన్నారు తప్ప పనులు మాత్రం ఎక్కడా ముందుకు కదిలిన పరిస్థితి కనిపించట్లేదు. పనులు కదలాలంటే నిధులు కేటాయింపు జరగాలి. నిధుల కేటాయింపు సంబంధించి కూడా ఎక్కడ ఒక అడుగు కూడా ముందుకు పడిన దాఖలా కూడా కనిపించడం లేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి దగ్గర సమీక్ష సమావేశం నిర్వహించినప్పుడు చంద్రబాబు నాయుడు మూడు రకాలుగా పనులని బాగాలుగా విడదీయండి అని చెప్పి ఆదేశించారని పత్రికల్లో వచ్చింది. అవి శాశ్వత నిర్మాణాలకు సంబంధించినవి, పుష్కరాల ఏర్పాటుకు సంబంధించినవి, పుష్కరాల వసతులకు సంబంధించినవిగా విభజించండి అని చెప్పినట్టుగా పత్రికల్లో వచ్చింది. ఈ మూడింటికి సంబంధించి దాదాపు 5,000 కోట్ల రూపాయలు అంచనా వ్యయంతో పనులు ఇచ్చారని చెప్పి అని పత్రికల్లో వచ్చిన కథనాలు కనిపిస్తా ఉన్నాయి. ఇప్పటివరకు ఆ 5,000 కోట్ల రూపాయలకు సంబంధించిన వాటిల్లో ఏ పనులు చేపట్టాలి, ఆ పనులకు సంబంధించి నిధులు ఏమొచ్చాయి, ఏ పనులు ప్రారంభించారు అని చూస్తే మొత్తంగా సున్నా తప్ప ఎక్కడా కనిపించడం లేదు. మరి ఇక ఏడాది కాలం మాత్రమే పుష్కరాలకు సమయం ఉంది. ఈ ఏడాది కాలం లోపు 5000 కోట్ల రూపాయలకు సంబంధించిన పనులు ఎట్లా చేపడతారు, ఎలా పూర్తి చేస్తారు అనేటువంటి అంచనాలు కూడా ఎక్కడా స్పష్టంగా ఉన్నట్టు కనిపించట్లేదు. అందుకనే మేము సిపిఎం పార్టీగా జిల్లా అధికారులని, ప్రజా ప్రతినిధులని విజ్ఞప్తి చేస్తూ ఉన్నాం. పుష్కర పనులకి సంబంధించి నగరంలో, జిల్లాలో ఉన్నటువంటి రాజకీయ పార్టీలు, పూర్వపు రాజమండ్రి నగర కార్పొరేటర్లు లేదా దాని మీద అవగాహన ఉన్న వ్యక్తులు, సంస్థలు ఏవైతే ఉన్నాయో వాటన్నిటితోటి ఒక అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించండి. అఖిలపక్ష సమావేశంలో వచ్చేటువంటి సూచనలు, సలహాలని పరిగణనలోకి తీసుకొని వాటి ఆధారంగా పనులు ప్రారంభించండి తక్షణమే అని చెప్పి మేము కోరుతున్నాం ఉన్నాం. ఎందుకంటే అధికారులు మొత్తం, జిల్లా అధికారులు మొత్తం కొత్త అధికారులు వచ్చి ఉన్నారు. గత పుష్కరాల్లో పనిచేసినటువంటి అనుభవం ఉన్న అధికారులు కూడా ప్రస్తుతానికి కనిపించట్లేదు. ఆ రీత్యా అవగాహన కూడా లేకపోవడంతో పనులు ప్రారంభం కావట్లేదు. కాబట్టి తక్షణమే పుష్కరాలకి సంబంధించిన పనుల మీద జిల్లా అధికార యంత్రాంగం అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు.

సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో

## ప్రపంచ ఆరోగ్య దినోత్సవం



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండల ప్రాథమిక కేంద్రంలో వైద్యాధికారులు డాక్టర్ ఎం.శైలజా రాణి, డాక్టర్ జగదీష్ కృష్ణ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవ నిర్వహించబడింది. ఈ సందర్భంగా డాక్టర్ జగదీష్ కృష్ణ మాట్లాడుతూ ఈ సంవత్సరం ప్రపంచ ఆరోగ్య సంస్థ "ఆరోగ్యం కోసం అందరూ ఏకమవుదాం. విజ్ఞానానికి మద్దతు పలుకుదాం"అనే నినాదాన్ని రూపొందించి ఆరోగ్యం గురించి ప్రపంచ దేశాలన్నీ కలిసి పని చేయాలని పిలుపునివ్వడం జరిగిందన్నారు. ప్రజలందరూ ఆరోగ్యకరమైన జీవన శైలిని అవలంబించాలని, పర్యావరణాన్ని పరీక్షించాలని, మూఢనమ్మకాల్ని రూపుమాపాలని, తద్వారా ప్రజారోగ్యం మెరుగుపడుతుందని తెలియజేశారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది "ఆరోగ్యమే మహాభాగ్యం - అందరికీ సంపూర్ణ ఆరోగ్యం మన లక్ష్యం" అనే నినాదంతో ప్లకార్డులు పట్టుకొని అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎం పి హెచ్ ఈ ఓ వై.ఎస్.రాయుడు, పి హెచ్ ఎన్ కె.ఆదిలక్ష్మి సూపర్వైజర్ కె సుధాకర్, హెల్త్ అసిస్టెంట్లు పి నందీష్, ఎన్ వెంకట్రావు, గంగాధర్, ఏఎన్ఎంలు వరలక్ష్మి ,పద్మజ్యోతి, విశాలి, అరుణ, అమృత, మున్నీసా, శాలిమా, ఎల్ టి శిల్పా ఆశా కార్యకర్తలు దేవి, కుమారి, జ్యోతి, విజయ, రామ సీత, లక్ష్మీ మొదలగువారు పాల్గొన్నారు.

సీతానగరం మండలంలోని పలువురికి

## సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసిన బత్తుల వెంకటలక్ష్మి



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలంలోని వైద్యం అనంతరం స్థానిక ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సిఫారసుతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు కమిటీ కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి చేతుల మీదుగా వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. పురుషోత్త పట్నం గ్రామానికి చెందిన మట్ట పద్మకు రూ. 30786/- లు, తొట్టిపూడి పోసి రత్నంకు రూ.23,920/- లు, వంగలపూడి గ్రామానికి చెందిన గట్టి వెంకటలక్ష్మికి రూ. 23,920/- లు, కుట్టి సుజాతకు 38,392/- లు, సింగవరం గ్రామానికి చెందిన సమ్మెట్ల శ్రీనుకు రూ.44,500లు, రోజకుర్తి స్వర్ణలతాదేవికి రూ.53,941/- లు, దార్లు పిల్లి ప్రసాద్ కు రూ.25524/- లు, సీతానగరానికి చెందిన మల్లి పూడి సత్యవేణికి రూ.23,400/- లు, మోతూరు శ్యామలకు రూ.38,902/- లు, రాపాక గ్రామానికి చెందిన చుండ్రు కనక లక్ష్మికి రూ. 25920/- లు, రఘుదేవపురం గ్రామానికి చెందిన బాదుపాటి ఏసమ్మకు రూ.30,025/- లు, చాపల మహి వర్షిత్ కు రూ 30,786/- లు, ముగ్గళ్ళ గ్రామానికి చెందిన బెడపూడి వీరస్వామికి రూ 62,729/-లు, ఇనుగంటి వారి పేటకు చెందిన దుళ్ళ వీరబాబుకు రూ.25,166/-ల చెక్కులను స్వయంగా ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్డిఎ కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

తెలుగోడి ఆత్మ గౌరవం

## దేశ రాజధానిలో నిలిపిన వ్యక్తి ఎన్టీఆర్

**అతిథిగా కాదు, ఆడపడుచుగా హాజరయ్యాను : ఎంపీ పురంధేశ్వరి**



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజకీయ హోదాతో ముఖ్యఅతిథిగా కాక తెలుగు వారి అన్న ఎన్టీఆర్ కుమార్తెగా, తెలుగింటి ఆడపడుచుగా ఆనందోత్సాహంతో విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరైనట్లు రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాయవరం మండలం, లొల్ల గ్రామంలో దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారక రామారావు విగ్రహావిష్కరణ కార్యక్రమం మంగళవారం తెదేపా కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తొలుత ముఖ్య అతిథి పురందేశ్వరి చేతుల మీద విగ్రహావిష్కరణ చేయించి, విగ్రహానికి గజమాల వేయడం ద్వారా నివాళులర్పించారు. అనంతరం స్థానిక సమావేశ మందిరంలో మండపేట నియోజకవర్గ శాసనసభ్యులు వేగుల జోగేశ్వరరావు అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్పై వ్యతిరేకతతో పార్టీని స్థాపించి కేవలం 9 నెలలోనే అధికారం పొందిన ఏకైక నేత ఎన్టీఆర్ అని కొనియాడారు. ఎన్టీఆర్ పార్టీ స్థాపించినప్పుడు వ్యవస్థాపక సభ్యులలో ఒకరిగా తమ తండ్రి కొనసాగడం ఎన్టీఆర్ కుటుంబంతో తమకున్న అవినాభావ సంబంధానికి నిదర్శనమని గుర్తు చేశారు. అనంతరం ముఖ్య అతిథి రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యులు దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ విలువల ఆస్తిగా తెలుగువారి ఆత్మగౌరవానికి నిదర్శనం గా ఎన్టీఆర్ జీవించారని, ఎన్టీఆర్ కూతురుగా ఆయననుండే పట్టుదల క్రమశిక్షణలు నేర్చుకున్నానని ఎంత ఎదిగినా ఒదిగి ఉండడం ఎన్టీఆర్ నేర్పించారని గుర్తు చేశారు. రాజకీయ హోదాలో కాక అన్నగారు అని తమ తండ్రి ప్రేమగా పిలుచుకునే వారి మధ్యకు ఆడపడుచు హాజరయ్యానని ఇది తన అదృష్టంగా భావిస్తున్నానని ఆనందం వ్యక్తం చేశారు. ఈ ఈ కార్యక్రమంలో మండపేట, అనపర్తి నియోజకవర్గం అన్ని గ్రామాల పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## ప్రతి నీటి చుక్కను సద్వినియోగం చేసుకోవడమే జలధార

**- రాజవోలు గ్రామంలో జలధార కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గోరంట్ల**



**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రతి నీటి చుక్కను సద్వినియోగం చేసుకోవడమే జలధార యొక్క ముఖ్య ఉద్దేశమని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. మంగళవారం ఉదయం రాజవోలు గ్రామంలో జలధార కార్యక్రమంలో భాగంగా చెరువు వద్ద చేయవలసిన అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ఆ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ నీటి భద్రత సాగునీటి సంఘాల బాధ్యత అని, కూటమి ప్రభుత్వం ఏప్రిల్ 6 తేదీ నుండి జూలై 14 వరకు వంద రోజులపాటు జలధార కార్యక్రమాన్ని అమలు చేస్తుందని తెలిపారు. నియోజకవర్గంలో గల సాగునీటి చెరువుల మరమ్మత్తులు చేయడం, నీటి సామర్థ్యం పెంచేందుకు పూడిక తీయడం, చెరువుల ద్వారా వెళ్లే కాలువలు శుభ్రం చేయడం, వర్షపు నీరు వృధా కాకుండా చెరువులోకి మళ్లించడం వంటి కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. అలాగే చెరువుగట్టుపై మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందిస్తామని, వీటన్నిటి ద్వారా భూగర్భ జలాలు సామర్థ్యాన్ని పెంపుదల చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల తెదేపా అధ్యక్షుడు మచ్చేటి ప్రసాద్, ఎం.పీ.డీ.వో సునీల్ ఆర్మ్ స్ట్రాంగ్, నిమ్మలపూడి రామకృష్ణ, వల్లూరి చెంచురాజు, కురుకూరి కిషోర్, మామిడిశెట్టి సువర్ణ కుమారి, ఏ.పీ.వో అన్నపూర్ణ, వల్లూరి శ్రీరామ్ చౌదరి, గాలి వెంకటేశ్వరరావు, ముత్యాల రామారావు, తదితరులు పాల్గొన్నారు.

## ఇది ముమ్మాటికి వైసిపి విష వ్యూహం

- ఏబీఎన్- ఆంధ్రజ్యోతిపై దాడి ప్రయత్నాన్ని ఖండించిన గన్నికృష్ణ
- వార్తా కథనాలు అభ్యంతరకరంగా ఉంటే న్యాయపరంగా పోరాడాలని సూచన
- ఇలాంటి సంఘటనలపై ప్రభుత్వం మెతకగా వ్యవహరించడం సరికాదు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఒక పత్రికా అధినేతగా రాజకీయాలలో జరిగే అంశాలను విశ్లేషించి నప్పుడు అది అభ్యంతరకరంగా ఉంటే దానిపై న్యాయబద్ధంగా పోరాటం చేయాలి గాని పత్రికా కార్యాలయాలపై దాడులకు దిగడం సరికాదని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ అన్నారు. హైదరాబాదులో ఏబీఎన్- ఆంధ్రజ్యోతి కార్యాలయం పై వైసీపీ నాయకులు చేస్తున్న నిరసనను, దాడి ప్రయత్నాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఇది ముమ్మాటికీ వైసీపీ విష వ్యూహమని ఆయన అన్నారు. ఆందోళన ముసుగులో ఏబీఎన్ - ఆంధ్రజ్యోతి పై దాడికి పాల్పడే ప్రయత్నానికి వైసీపీ నేతలు దిగారని, దీనిపై ప్రభుత్వాలు సీరియస్ గా స్పందించాలన్నారు. జగన్మోహన్ రెడ్డి రాజధానిపై చేసిన పిచ్చి వ్యాఖ్యలపై ఏబీఎన్ రాధాకృష్ణ ఒక విశ్లేషణ చేశారని దానిని జీర్ణించుకోలేక వైసీపీ నేతలు దాడులకు ప్రయత్నించడం వారి మూర్ఖత్వానికి నిదర్శనమన్నారు. ఏకంగా పార్టీ నాయకులను హైదరాబాద్ తరలించి మూకుమ్మడి దాడికి వెళ్లడం ప్రజాస్వామ్యంలో పత్రిక స్వేచ్ఛను హరించడమేనని ఆయన తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. రాజధాని అమరావతి విషయంలో గెజిట్ నోటిఫికేషన్ వచ్చిన ఆనందాన్ని ముక్కలు చేయాలన్న విష వ్యూహంతో వైసిపి డ్రామాలు ఆడుతుందని మండిపడ్డారు. వైసీపీ చేసిన మూడు రాజధానుల ప్రయత్నం చెల్లలేదని జగన్ తెరపైకి తెచ్చిన మావిగన్ అనే నినాదాన్ని ప్రజలు చీకొట్టారని గన్ని అన్నారు. జగన్ మావిగన్ ప్రకటనపై ఆ పార్టీ నేతలే పరోక్షంగా విమర్శలు కూడా చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. గతంలో చంద్రబాబు నాయుడు ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు అధికార మదంతో వైసిపి నేతలు వంశీ,జోగి రమేష్, అంబటి రాంబాబు, కొడాలి నాని వంటి నాయకులు భువనేశ్వరి పై చేసిన వ్యాఖ్యలు క్షమించరానివన్నారు అసెంబ్లీ సాక్షిగా ఒక మహిళను కించపరిచి అగౌరవంగా మాట్లాడిన ఈ నేతలకు ప్రజలు చెప్పుతో కొట్టినట్టు సమాధానం చెప్పారని మండిపడ్డారు. తప్పుడు రాతల మీద దాడులు చేయాలి అంటే జగన్మోహన్ రెడ్డి పత్రిక పై ఈపాటికి ఎన్నిసార్లు దాడులు చేయాలో చెప్పలేమన్నారు. అలాంటి విష సంస్కృతి సరికాదని ఏదైనా వార్తా కథనం అభ్యంతరంగా ఉంటే దానిపై న్యాయపరంగా పోరాటం చేయాలని ఈ సందర్భంగా గన్ని సూచించారు. ఈ విషయాలపై ప్రభుత్వం మెతకగా వ్యవహరించడం సరికాదని విష వ్యూహాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## యానాంలో మాజీ ఎంపీ హర్షకుమార్ పాదయాత్రకు అఖండ స్పందన

**గోదావరి జిల్లాల్లో కాంగ్రెస్ వైపు భారీ పవనాలు యానాం, పుదుచ్చేరి**
**అమలాపురం మాజీ పార్లమెంటు సభ్యులు, ప్రముఖ దళిత నాయకులు జి.వి. హర్షకుమార్**




**యానాం, విశ్వం వాయిస్ న్యూస్ :** యానాం నియోజకవర్గంలో చేపట్టిన భారీ పాదయాత్రకు విశేష స్పందన లభించింది. ఈ పాదయాత్రకు అపూర్వ సంఖ్యలో ప్రజలు హాజరై భారత జాతీయ కాంగ్రెస్ (ఐ ఎం సి) పట్ల తమ సంపూర్ణ మద్దతును తెలియజేశారు. యానాం వీధులు కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ప్రజలు చేసిన నినాదాలతో హోరెత్తాయి. ఆంధ్రప్రదేశ్‌లో అత్యంత బలమైన దళిత గొంతుకగా గుర్తింపు పొందిన రెండు సార్ల ఎంపీ హర్షకుమార్ నాయకత్వంలో.. వేలాది మంది మద్దతుదారులు, స్థానికులు మరియు పార్టీ కార్యకర్తలు ఈ పాదయాత్రలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇది ఈ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ సాధించిన పునరుత్తేజాన్ని, క్షేత్రస్థాయిలో పార్టీ బలాన్ని స్పష్టంగా తెలియజేస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని కీలక పార్లమెంట్ నియోజకవర్గాలైన అమలాపురం, కాకినాడ మరియు రాజమండ్రి మధ్యలో ఉన్న యానాం భౌగోళికంగా, రాజకీయంగా ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. యానాంలో శ్రీ హర్షకుమార్ ర్యాలీకి లభించిన అపూర్వ స్పందన.. పొరుగున ఉన్న కోస్తా జిల్లాలపై కూడా బలమైన ప్రభావాన్ని చూపుతోంది. దళిత, బడుగు, బలహీన వర్గాలు మరియు మైనార్టీ ఓటు బ్యాంకులు కాంగ్రెస్ వైపు ఏకతాటిపైకి వస్తున్నాయని ఇది నిరూపిస్తోంది. ఈ పాదయాత్ర అద్భుత విజయం సాధించడం.. రాహుల్ గాంధీ సందేశం క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి ఎంత బలంగా వెళ్తుందో అనడానికి నిదర్శనం. కాంగ్రెస్ మేనిఫెస్టోలోని ముఖ్య అంశాలైన 'హిస్సేదారీ న్యాయ్' (సామాజిక న్యాయం మరియు సమాన వాటా), దేశవ్యాప్త కులగణన ఆవశ్యకత, మరియు భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలన్న పార్టీ దృఢ సంకల్పానికి ప్రజల నుండి పెద్ద ఎత్తున మద్దతు లభిస్తోంది. "యానాంలో జి.వి. హర్షకుమార్ పాదయాత్రలో పోటెత్తిన జనసంద్రం ప్రజల నాడిని స్పష్టం చేస్తోంది" అని కాంగ్రెస్ ప్రతినిధి ఒకరు పేర్కొన్నారు. ఎన్నికల సమయం దగ్గరపడుతున్న కొద్దీ, సామాజిక సాధికారతపై కాంగ్రెస్ పార్టీ పెట్టిన దృష్టి.. హర్షకుమార్ లాంటి ప్రజాబలం ఉన్న నాయకుల కృషితో తోడవడంతో ఈ ప్రాంత రాజకీయ ముఖచిత్రంలో ఒక నిర్ణయాత్మక, చారిత్రాత్మక మార్పు రాబోతోందని స్పష్టమవుతోంది.

కెరియర్ పట్ల అవగాహనతో

## కోర్సులు ఎంపిక

**- గోదావరి బాలోత్సవం ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు**
**- సివిల్ సర్వీసెస్ ప్రాథమిక వివరాలు పుస్తక ఆవిష్కరణ**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** విద్యార్థులు కెరియర్ పట్ల అవగాహనతో కోర్సులు ఎంపిక చేసుకోవాలని జనవిజ్ఞాన వేది క రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. నగరంలోని సంహిత కన్వెన్షన్ హాల్లో సోమవారం గోదావరి బాలోత్సవం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. గోదావరి బాలోత్సవ్ కమిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శి తులసి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయు లు చిలుకూరి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. పదవ తరగతి, ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన విద్యార్థులు అధిక సంఖ్యలోపాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా సివిల్ సర్వీసెస్- ప్రాథమిక వివరాలు పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యార్థుల అభిరుచి, సామర్థ్యం అవకాశాలు దృష్టిలో ఉంచుకుని లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా అనేక కొత్త కోర్సులు వస్తున్నాయని, విద్యార్థులు వాటి గురించి కూడా తెలుసుకొని విజ్ఞానం పెంచుకుంటూ ఉపాధి పొందే విధంగా జీవిత మార్గాలను ఎంచుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లో ఒక మూస పద్ధతిలో ఇంటర్ పూర్తయిన విద్యార్థులంతా ఇటు ఇంజనీరింగ్, ఎంబిబిఎస్ కోర్సుల కోసమని ఇబ్బడి ముబ్బడిగా బైపిసి, ఎంపిసి కోర్సులను ఎంచుకుంటు న్నారని అన్నారు. సత్వర ఉపాధి కల్పించే ఐటిఐ, పాలిటెక్నికల్, టిటిసి, నర్సింగ్, ప్లంబింగ్, ల్యాబ్ టెక్నీషియన్ వంటి ఎన్నో కోర్సులు ఉన్నాయని అవి కూడా భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. అదే విధంగా అత్యధిక మంది సాఫ్ట్ వేర్ అంటూ కంప్యూటర్ రంగం వైపు వెళుతున్నారని, అయి తే కంప్యూటర్ పరిజ్ఞానం చాలా అవసరం గానీ, కంప్యూటర్ కోర్సు ఒకటి మాత్రమే చేస్తే ఎప్పటికైనా ఇబ్బందేనని అన్నారు. ఇటీవల కాలంలో ఒరాకిల్ సంస్థ 30 వేల ఉద్యోగాలు ఒక్కసారిగా తొలగించిందని, ప్రపంచ వ్యాప్తంగా సాఫ్ట్వేర్ రంగానికి గడ్డుకాలం నడుస్తుందని అన్నారు. ఐఐటి లు, ఎన్ఐటిలు మంచి ఫాకల్టీ ఉన్న ఇంజనీరింగ్ కళాశాలల్లో ఇంజినీరింగ్ చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. చార్టెడ్ అకౌంట్, బిజినెస్ మేనేజ్మెంట్, హటరీటల్ మేనేజ్మెంట్, ఎయిర్ హోస్టెస్ కోర్సులకు కూడా ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని అన్నారు. విద్యా ర్థులు ఏ కోర్సు చదివినిప్పటికీ అందులో నైపుణ్యం, విషయ పరిజ్ఞానం సంపాదించినపుడు మంచి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని అన్నారు. సామాజిక అవసరాలకు అనుగుణంగా విద్యను అభ్యసించాలని ఎప్పటికపుడు మారుతున్న పరిజ్ఞానాన్ని, సామాజిక పరిస్థితులను ఆకలింపు చేసు కోవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. అనంతరం ఆయన విద్యార్థులు అడిగిన పలు సందేహాలకు సమాధానం చెప్పారు.


ఉచిత సీటు పొందిన విద్యార్థుల తలిదండ్రులను వేధిస్తున్న

## ప్రైవేటు స్కూళ్ళ యాజమాన్యం

**ఉచిత విద్యా విద్యార్థి తలిదండ్రుల సంఘం అధ్యక్షుడు కొమ్ము సత్తిబాబు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉచిత విద్యకు సంబంధించి జిల్లాలోని కొంతమంది ప్రైవేటు స్కూళ్ళ యాజమాన్యం యాక్టివిటీ ఫీజు రూ.6 వేల నుంచి రూ.15 వేలు కడితేనే సీటు ఇస్తామని తలిదండ్రులను వేధిస్తున్నారని ఉచిత విద్యా విద్యార్థి తలిదండ్రుల సంఘం అధ్యక్షుడు కొమ్ము సత్తి బాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఉచిత విద్యా విద్యార్థి తల్లిదండ్రుల సంఘం అధ్యక్షుడు కొమ్ము సత్తిబాబు ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఫీజు కట్టనవసరం లేదని జిల్లా విద్యాశాఖ అధికారి సర్క్యులర్ జారీ చేయాలని ఆయన కోరారు. ఉచిత విద్యా హక్కును కాలరాసేలా ప్రవర్తిస్తున్నందున వెంటనే ఈ సర్క్యులర్‌ను లిఖిత పూర్వకంగా ప్రైవేటు స్కూళ్ళ యిజమాన్యాలకు పంపించాలని ఆయన కోరారు.

విశ్వం వాయిస్
VISWAMVOICE TELUGU DAILY

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్
కోనసీమ జిల్లా ఎడిషన్

బుధవారం, 08 ఏప్రియల్ 2026
www.viswamvoice.com





# సర్పంచులపై మరింత బాధ్యత పెరిగింది

### గొల్లపల్లి అమూల్యా



**సఖినేటిపల్లి,విశ్వం వాయిస్ న్యూస్ :** ఈనెల రెండవ తారీకుతో గ్రామ సర్పంచుల 5 సంవత్సరాల పదవీకాలం ముగియడంతో సఖినేటిపల్లి మండలం సఖినేటిపల్లి లంక గ్రామ సర్పంచ్ శ్రీమతి రేవూరి రాజేశ్వరి ఏసునరసింహరాజా ఐదు సంవత్సరాలు గ్రామానికి వారు అందించిన సేవలకు గాను గ్రామ పెద్దలు ప్రజలు ఏర్పాటుచేసిన పదవి విరమణ సన్మాన సభలో పాల్గొన్న రాజోలు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ శ్రీమతి గొల్లపల్లి అమూల్య. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్పంచ్ల పదవీకాలం ముగియడంతో వారి బాధ్యత తీరిపోలేదని వారిపై మరింత బాధ్యత పెరిగిందని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో వారు కీలకంగా వ్యవహరించి ఎన్డీఏ కూటమి తరుపున నిలబడిన అభ్యర్థులను గెలిపించే బాధ్యత కూడా వారిపై ఉందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ దంపతులకు దుస్సాలువా కప్పి సన్మానించి భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు చేపట్టాలని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ముదునూరి చినబాబు రాజు, మండల పార్టీ అధ్యక్షులు తాడి సత్యనారాయణ, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు గొనిపాటి రాజు, గ్రామ శాఖ అధ్యక్షులు పప్పుల శివప్రసాద్, కొండా కిషోర్, పులగం రమేష్, జిల్లెళ్ళ ప్రసాద్ తదితర కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

# కొంకపల్లిలో కన్నుల పండువగా వీరన్న బాబు సంబరం

### 110 ఏళ్ల భక్తి వారసత్వం చాటిన దొంగ వారి వంశీయులు



**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

కోనసీమ ఆధ్యాత్మిక కేంద్రమైన అమలాపురం సమీపంలోని కొంకపల్లి 'దొంగ వారి పాలెం'లో ఆదివారం (ఏప్రిల్ 5, 2026) శ్రీ వీరభద్ర స్వామి (వీరన్న బాబు) సంబరం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో దిగ్విజయంగా జరిగింది. సుమారు 110 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ పురాతన సంబరాన్ని చూడటానికి ఉమ్మడి గోదావరి జిల్లాల నుండి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుండే దొంగ వారి వంశీయుల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈ సంబరానికి మూలకర్త దొంగ వీరమ్మ - వెంకన్న ల కాలం నాటి నుండి వస్తున్న సంప్రదాయం ప్రకారం, కుటుంబంలో చనిపోయిన వారిని 'వీరకుమారులు'గా భావించి "గద్దెనెక్కించే" కార్యక్రమం భక్తులను పరవశింపజేసింది. గద్దెపై కొలువుదీరిన వీరన్న బాబును దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. గతంలో రంగూన్ భక్తుడు చొల్లంగి రెడ్డమ్మ స్వామివారి మహిమకు ముగ్ధుడై సమర్పించిన 5 సెంట్ల భూమిలోనే ఈ సంబరం నిర్వహించబడింది. కోనసీమ వ్యాప్తంగా ఉన్న అనేక వీరభద్ర గద్దెలకు ఈ క్షేత్రమే మార్గదర్శి కావడంతో, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు ఇక్కడి పూజా విధానాలను ఆసక్తిగా తిలకించారు. వీరమ్మ గారు నెలకొల్పిన ఈ భక్తి మార్గం 110 ఏళ్లు గడిచినా నేటికీ ఆమె వారసుల ద్వారా అంతే నిష్ఠగా కొనసాగడం విశేషం. రాత్రి వరకు జరిగిన ఈ సంబరంలో డప్పు వాయిద్యాలు, వీరభద్రుని విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, వేలాది మంది భక్తుల సమక్షంలో ఈ వేడుక ముగిసింది. దొంగ వారి వంశీయులు వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. 110 ఏళ్ల నాటి ఈ పురాతన సంప్రదాయం నేటికీ కోనసీమ సంస్కృతికి అద్దం పడుతోందని భక్తులు కొనియాడారు.

# నేడు గంగలకుర్రు గ్రామంలో రెవెన్యూ సదస్సు కార్యక్రమం

### పట్టాదారు పాస్ బుక్‌లు పంపిణీ

**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబాజీపేట మండలంలో గంగలకుర్రు గ్రామంలో రైతులకు పట్టాదారు పాస్ బుక్ పంపిణీ కార్యక్రమం జరుగుతుందని తెదేపా మండల కార్యదర్శి గూడాల ఫణి ఒక ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం , జనసేన , బిజెపి పార్టీల నాయకులు, రాష్ట్ర, జిల్లా, మండల కమిటీ సభ్యులు, ఏఎంసీ చైర్మన్స్ , పిఎసిఎస్ చైర్మన్లు, వైస్ చైర్మన్,పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, ఎంపీటీసీ, మాజీ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలను ఆహ్వానించారు. రెవెన్యూ సదస్సు ఓ రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ జరిగిందని తెలిపారు.

### ప్రయాణికుల భద్రతకు

# అమలాపురం బస్టాండ్‌లో విస్తృత తనిఖీలు

### బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్‌తో ఆర్టీసీ బస్టాండ్‌లో క్షుణ్ణ పరిశీలన

**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**



డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఐపిఎస్ ఆదేశాల మేరకు ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అమలాపురం ఆర్టీసీ బస్టాండ్ పరిసరాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. మంగళవారం సాయంత్రం 5 గంటల నుండి 7 గంటల వరకు ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ఉన్న బస్సులు, పార్సిల్ కౌంటర్‌లోని అన్ని రకాల పార్సిళ్లను జిల్లా బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్ సిబ్బంది మరియు శిక్షణ పొందిన డాగ్ స్క్వాడ్‌తో కలిసి క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానాస్పద వస్తువులు ఏవీ లేకుండా పూర్తి స్థాయిలో తనిఖీలు నిర్వహించడం జరిగింది. ఈ తనిఖీలలో అమలాపురం పట్టణ సీఐ పి. వీరబాబు, ఎస్ఐ కె.ఎం. జోషి, జిల్లా బీడీ టీమ్ సిబ్బంది పాల్గొన్నారు. ప్రజల భద్రతకు ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తూ ఇటువంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పోలీసు అధికారులు తెలిపారు.

# ఏబీఎన్ కార్యాలయంపై దాడిని ఖండించిన కాట్రేనికోన ప్రెస్ క్లబ్



**కాట్రేనికోన, విశ్వంవాయిస్ న్యూస్ :** హైదరాబాద్‌లోని ఏబీఎన్ (ఎబిఎన్) ప్రధాన కార్యాలయంపై జరిగిన దాడిని కాట్రేనికోన ప్రెస్ క్లబ్ తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా కాట్రేనికోన ప్రెస్‌క్లబ్‌లో మంగళవారంఏర్పాటు చేసిన అత్యసర సమావేశంలో అధ్యక్షుడు పిఎస్ నాయుడు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో పత్రికలు, ప్రసార మాధ్యమాలపై దాడులు చేయడం అత్యంత హేయమైన చర్య అని మండిపడ్డారు. నిజాన్ని, నిర్భయంగా ప్రజల ముందుకు తీసుకువస్తున్న మీడియా గొంతు నొక్కాలని చూడటం, భౌతిక దాడులకు పాల్పడటం దుర్మార్గం అని పేర్కొన్నారు. పత్రికా స్వేచ్ఛపై జరిగిన ఈ దాడిని తీవ్రంగా పరిగణించాలని, దాడికి పాల్పడిన దుండగులను వెంటనే గుర్తించి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఎం విష్ణు, మట్టపర్తి రవీంద్రనాథ్, కే.సురేష్, గంటి బోస్ జగడం శ్రీనివాస్, ఎం శ్రీహరి, గ్రంధి నానాజీ, ఎన్ నాని బాబు, కొంకి రవి, జి.బ్రహ్మాజీ, పీవీ రమణ, డి.రవి, తాడి శ్రీనివాస్, తదితరులు ఈ దాడిని ఖండించారు.

### రావులపాలెంలో నేషనల్ హైవేలో

# రెండవ రోజు ఆక్రమణలు తొలగింపు



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** రావులపాలెంలో చాలాకాలం తర్వాత నేషనల్ హైవే అథారిటీ వాళ్లు రోడ్లు విస్తరణ నిమిత్తం తీసుకున్న ఆక్రమణ తొలగింపు ముందుగా హెచ్చరికలు జారీ చేసి స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించవలసినదిగా కోరినట్లు తెలియజేశారు అనంతరం సోమవారం అనగా 6 4 2026 తేదీనమొదలు పెట్టి మంగళవారం కూడానేషనల్ హైవే అధికారులు పోలీసు సిబ్బంది అధికారుల పర్యవేక్షణలో ఆక్రమణలను జెసిబిల ద్వారా చట్టప్రకారం తీస్తున్నామని తెలియజేశారు ఈ సందర్భంగా స్థానిక ప్రజలు హైవే ఆక్రమణ తొలగింపు పై హర్షం వ్యక్తం చేశారని. ట్రాఫిక్ కి ప్రతిరోజు చాలా ఇబ్బందులు పడేవారు చాలా ప్రమాదాలకు గురయ్యావారని అని పాదాచారులు వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యావారమని ఈ ఆక్రమణలను తొలగింపు ప్రజలకు చాలా ఆనందకరమని చెప్పారని తెలియజేసారు.

### కాట్రేనికోన మండల పరిషత్ కార్యాలయం నందు

# చలివేంద్రం ఏర్పాటు




**కాట్రేనికోన, విశ్వం వాయిస్ న్యూస్ :** కాట్రేనికోన మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపీడీఓ బి.రాజేశ్వరరావు చలివేంద్రం ప్రారంభించారు. వేసవి తీవ్రత దృష్ట్యా సదరు చలివేంద్రం ప్రజా ప్రయోజనార్ధం ఏర్పాటు చేశామని తెలిపారు.కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓలు శంకర్ నారాయణ,సూర్య నారాయణ రాజు, పరిపాలనాధికారి సంఘమిత్ర, విద్యాశాఖాధికారి-2 వెంకటరమణ, ఏపీవో చంద్రమోహన్, కాట్రేనికోన పంచాయతీ కార్యదర్శి జెవి సత్యన్నారాయణ, మండల పరిషత్ సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

### కొప్పిగుంట పంచాయతీని

# ఆకస్మిక తనిఖీ చేసిన ఎంపీడీవో బి.రాజేశ్వరరావు



**కాట్రేనికోన, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, కాట్రేనికోన మండలం కొప్పిగుంట గ్రామ పంచాయతీలను ఎంపీడీఓ బి.రాజేశ్వరరావు ఆకశ్మిక సందర్శన చేశారు. పంచాయతీలకు సంబంధించిన పలు రికార్డులను తనిఖీ చేశారు. ఆయా స్వర్ణ గ్రామ సచివాలయం సిబ్బంది విధిగా సమయపాలన పాటించాలని, ప్రజనీకానికి నిరంతరం అందుబాటులో ఉంటూ, పౌర సేవలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ఆదేశించారు. పారిశుధ్యం, మంచినీరు, వీధిదీపాలు వంటి మౌళిక అంశాలపై ఎప్పటికప్పుడు ప్రత్యేక అధికారులతో సమన్వయం చేసుకొని ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. విధుల నిర్వాహణలో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సదరు సందర్శనలో డిప్యూటీ ఎంపీడీఓలు శంకర్ నారాయణ, సూర్యనారాయణ రాజు పాల్గొన్నారు.

### ఉప్పూడి పంచాయతీ

# ప్రత్యేక అధికారిగా శంకర్ నారాయణ



**కాట్రేనికోన, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, కాట్రేనికోన మండలం ఉప్పూడి పం చాయతీ ప్రత్యేక అధికారిగా శంకర్ నారాయణ మం గళవారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక నాయకులు పంచాయతీ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. పంచాయతీలో ఉన్న సమస్యలను విన్నవించారు. తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యని ఉన్నతాధికారులకు తెలియజేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం చైర్మన్ బండారు ఏసు, మాజీ సర్పంచ్ రాంబాబు రమేష్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

### పేదల ఆరోగ్య పరిరక్షణకు

# ముఖ్యమంత్రి సహాయనిధి అండ

### రూ. 60 వేల సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ అందజేసిన కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ చొరవతో ఒక మహిళకు మెరుగైన వైద్యం అందించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. రామచంద్రపురం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన లెటర్ ఆఫ్ క్రెడిట్‌ను బాధిత మహిళకు అందజేశారు. కాజులూరు మండలం, ఉప్పుమిల్లి గ్రామానికి చెందిన తటపూడి మంగకు వైద్య చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.60,000 ఆర్థిక సహాయం మంజూరైనట్లు వాసంశెట్టి సత్యం తెలిపారు. ఈ మేరకు అమలాపురంలోని కిమ్స్ కోనసీమ హాస్పిటల్‌లో అవసరమైన చికిత్స అందించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లు వివరించారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదల ఆరోగ్య పరిరక్షణకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉందన్నారు. మంత్రి సుభాష్ కృషితో సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన ఈ నిధులతో బాధిత మహిళ మెరుగైన వైద్యం పొందాలని ఆకాంక్షించారు. చికిత్స పూర్తైన అనంతరం ఆసుపత్రి బిల్లులను 90 రోజుల్లోగా సమర్పిస్తే ప్రభుత్వం వాటిని పరిశీలించి సంబంధిత మొత్తం విడుదల చేస్తుందని తెలిపారు. అలాగే ఈ ఎల్ఓసీ లేఖ జారీ తేదీ నుంచి 30 రోజులపాటు చెల్లుబాటు అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైసీపీ నేతల తీరు చాలా అభ్యంతకరంగా ఉంది

### వారు తీరు మార్చుకోవాలి : ముత్యాల బాబ్జి



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** లోపాలను ఎత్తి చూపితే దాడులు చేస్తారా ఏబీఎన్ -ఆంధ్రజ్యోతి కార్యాలయాలపై వైసీపీ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం ముత్యాల బాబ్జి,జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు సాక్షిలో తెలుగుదేశం పార్టీ పైన మా నేతల పైన,రాసిన రోత రాతలకు వైసీపీ నేతలు ఏం సమాధానం చెప్తారు ఘోరాతి ఘోరమైన, నీచాతినీచమైన రాతలను సాక్షిలో వండి వార్చారు వైసీపీ నేతలు అంబటి రాంబాబు, కొడాలి నాని, రోజా వంటి వారు వాడే ఘోరమైన భాష కంటే దారుణంగా రాధాకృష్ణ వ్యాఖ్యానించలేదే రాజధాని విషయంలో జగన్మోహన్ రెడ్డి ఏం చెబితే దానికి ఎస్ అనేందుకు వైసీపీ నేతలు సిద్ధపడ్డారని మాత్రమే అన్నారు. మొదటేమో అమరావతి అంటే జైకొట్టారు.ఆ తర్వాత మూడు రాజధానులంటే ఆహా.ఓహో అన్నారు. ఇప్పుడు మావిగన్ అంటే జేజేలు పలుకుతున్నారు. ఇదే క్రమంలో రేపు కుటుంబసభ్యులను కూడా మీ వాళ్లు కాదంటే కూడా సరేననే పరిస్థితిలో ఉన్నారని మాత్రమే వ్యాఖ్యానించారు వీకెండ్ కామెంట్ బై ఆర్కేలో రాధాకృష్ణ చేసిన వ్యాఖ్యానంలో తప్పేముంది. జగన్మోహన్ రెడ్డి సొంత చెల్లి, తల్లికి వ్యతిరేకంగా వైసీపీ నేత రాచమల్లు ప్రసాద్ రెడ్డి ప్రెస్ మీట్ పెడితే సాక్షిలో ఫస్ట్ పేజీ బ్యానర్, లోపల ఫుల్ పేజీ వార్తలు రాశారు. వైసీపీ నేతలా మహిళలు, మహిళల గౌరవం గురించి మాట్లాడేది. ప్రజాస్వామ్య దేశంలో ఒక జర్నలిస్టుగా రాధాకృష్ణ తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు మీకు అభ్యంతరం ఉంటే ఖండన ఇచ్చుకోండి. అంతే కానీ దాడులకు తెగబడుతారా వైసీపీ నేతల తీరు చాలా అభ్యంతకరంగా ఉంది వారు తీరు మార్చుకోవాలి అని ముత్యాల బాబ్జి తెలిపారు.

# నీటి భద్రత, సంరక్షణ అందరి బాధ్యత : మంత్రి వాసంశెట్టి



**రామచంద్రపురం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** మానవాళి మనుగడకు నీరు ఆధారమని, నీటి భద్రతను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. సాగునీటి సంరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన 100 రోజుల ప్రత్యేక ప్రణాళికను సోమవారం రామచంద్రపురం మండలం వెల్ల గ్రామంలో మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా కోరింగ కెనాల్, వెల్ల లాకుల వద్ద గుర్రపు డెక్క తొలగింపు పనులను ఆయన పరిశీలించారు. చెరువుల పునరుద్ధరణ, భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నాలుగు దశల్లో అమలు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. అనంతరం వెల్ల పంచాయతీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, నీటి వనరుల సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. చెరువులు, కాలువలు శుభ్రపరిచే పనుల్లో రైతులు, నీటి సంఘాల ప్రతినిధులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఏప్రిల్ 6 నుంచి జూలై 14 వరకు కొనసాగే ఈ 100 రోజుల ప్రణాళిక ద్వారా సాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గ పరిధిలో కాలువల పూడికతీత, షెల్టర్ల మరమ్మతుల కోసం 4 కోట్ల 70 లక్షల రూపాయలతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు అధికారులు మంత్రికి వివరించారు. కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ, పంటలు పాలు పోసుకునే ఈ కీలక సమయంలో రైతులకు సాగునీటి కొరత లేకుండా చూడాలని అధికారులను కోరారు. రామచంద్రపురం రూరల్ మండల టిడిపి అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనుబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఈఈ వి.వి. రామకృష్ణ, ఎంపీడీవో రాంబాబు, ఏఈ సుజాత, ఏఓలు మణిదీప్, అశోక్, డీసీలు నిడదవోలు సుబ్రహ్మణ్యం, దాట్ల విజయ గోపాల రాజు, లకాని కృష్ణ చైతన్య, పేపకాయల నారాయణరావు, యనుముల గోపాలకృష్ణ మరియు భారీ సంఖ్యలో రైతులు, కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# అంబాజీపేటలో ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు గ్రామంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు కురసా ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి దంతులూరి రమా వర్మ ముఖ్య అతిథిగా హాజరై బీజేపీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ స్థాపన దినోత్సవం ప్రాముఖ్యతను వివరించి, దేశ అభివృద్ధిలో బీజేపీ పాత్రను ఆమె వివరించారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాల గురించి నాయకులు ప్రస్తావించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు అయ్యగారి కృష్ణ సుందర్, కముజు శ్రీను పాల్గొని పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. మండల ఉపాధ్యక్షులు కనకాల దొరబాబు, గోనెమడతల కనకరాజు, పేరభతుల సుబ్బారావు, అయ్యగారు శ్రీను, గుత్తుల సత్తిబాబు, ఆకెళ్ల సూరిబాబు, సాధనాల కేశవ్, వీరవిల్లి ఫణి కుమార్, జగదీష్, రామలింగేశ్వరరావు, కుడుపూడి సుబ్రహ్మణ్యం, జి నాగరాజు తదితరులు హాజరయ్యారు. పార్టీ కార్యకర్తలు ఉత్సాహంగా నినాదాలు చేస్తూ వేడుకలను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా నాయకులు పార్టీ సిద్ధాంతాలు, భవిష్యత్ లక్ష్యాలపై చర్చించారు.

### అంబాజీపేట జిల్లా పరిషత్ పాఠశాలలో

# బాలల హక్కుల ఉల్లంఘన

### బాధ్యులపై కఠిన చర్యలు తప్పవు



**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబాజీపేట జిల్లా పరిషత్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి సిహెచ్ మణికంఠ గోతులు తీసే పనిలో పాల్గొనాల్సిందిగా ఆ క్రమంలోనే గుణపం తగిలి మధ్య వేలు తీవ్రంగా గాయపడిన సంఘటన తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతం బాలుడు అనిల్ ఆర్థోపెడిక్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు డా. నాగ మానస ఈరోజు ఆసుపత్రికి వెళ్లి బాలుడిని పరామర్శించారు. ఈ సందర్భంగా బాలుడితో ఎవరు ఈ పనులు చేయించారు? ఎందుకు చేయించారు? అనే అంశాలపై లోతుగా విచారణ చేపట్టారు. విచారణలో ఉపాధ్యాయుల నిర్లక్ష్యం స్పష్టంగా బయటపడింది. బాలుడిని ప్రమాదకరమైన పనుల్లో పాల్గొనేటట్లు ప్రేరేపించడం ద్వారా బాలల భద్రత పట్ల ఘోరమైన నిర్లక్ష్యం ప్రదర్శించినట్టు తేటతెల్లమైంది. ముఖ్యంగా ప్రధానోపాధ్యాయుడు సాయిరాం బాధ్యతాయుతంగా వ్యవహరించకపోవడం స్పష్టంగా కనిపిస్తోంది. పాఠశాల పరిధిలో బాలల చేత ఇలాంటి పనులు చేయించడం చట్టవిరుద్ధమని, ఇది బాలల హక్కులపై ప్రత్యక్ష దాడి అని కమిషన్ సభ్యురాలు స్పష్టం చేశారు. ఈ ఘటనపై సమగ్ర నివేదిక తయారు చేసి బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయనున్నట్టు తెలిపారు. పాఠశాలలు విద్యకు మాత్రమే పరిమితం కావాలి బాలల ప్రాణాలతో చెలగాటం అనుమతించబడదు అని నాగ మానస స్పష్టంగా హెచ్చరించారు.

### సమనస గ్రామంలో నీటి భద్రత సాగు నీటి సంఘాల బాధ్యత

# కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ఆనందరావు

**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నీటి భద్రత సాగు నీటి సంఘాల బాధ్యత కార్యక్రమం అమలాపురం రూరల్ మండలం సమనస గ్రామంలోని లకుల వద్ద ఘనంగా ప్రారంభమైంది. ఎమ్మెల్యే ఆనందరావు ఈ కార్యక్రమానికి నేతృత్వం వహించి సాగునీటి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన లకులను క్షేత్రస్థాయిలో సందర్శించి ప్రస్తుత పరిస్థితి, పూడికతీత పనుల అవసరంపై అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమం ఏప్రిల్ 6 నుంచి జూలై 5 వరకు 90 రోజుల పాటు కొనసాగనుందని తెలిపారు. చెరువుల పునరుద్ధరణ, భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పనుల అమలు కోసం కేటాయించిన 70 రోజుల సమయాన్ని సమర్థవంతంగా వినియోగించి రైతులకు మేలు కలిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే ఆనందరావు స్థానిక రైతులతో ఆత్మీయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. రైతులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ, నీటి భద్రత కోసం ప్రభుత్వం చేపట్టిన జలయజ్ఞమిదని, ప్రజల భాగస్వామ్యంతోనే ఇది విజయవంతమవుతుందని పేర్కొన్నారు. తక్షణమే పనులు ప్రారంభించి క్షేత్రస్థాయిలో మార్పు తీసుకురావడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నీటి పారుదల శాఖ అధికారులు, సాగునీటి సంఘాల ప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# అన్నవరం దేవస్థానం పాలకమండలి నియామకం...!

## అధికారికంగా ప్రకటించిన తెలుగు దేశం పార్టీ - దేవాదాయ ధర్మాదాయశాఖ ప్రకటనే తరువాయి - పదవీ కాలం, ప్రమాణ తేదీ వెల్లడి కావాల్సి ఉంది



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం అన్నవరం రత్నగిరి శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం పాలక మండలిని మంగళవారం నియమించారు. ఈ నియామకాన్ని తెలుగు దేశం పార్టీ అధికారికంగా ప్రకటించింది. పాలకవర్గం పదవీ కాలం రెండేళ్ల పాటు కొనసాగే సంప్రదాయం కొనసాగుతోంది. కాగా ప్రస్తుత పాలకవర్గం వంశపారంపర్య ధర్మకర్తగా ఇనుగంటి వెంకట రోహిత్ యధావిధిగా కొనసాగుతున్నారు. ఇక సభ్యులుగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి రావిపాటి సత్యనారాయణ, కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి పర్వత సూర్యారావు (సురేష్), దనేకుల సూర్య భాస్కరం, జగ్గంపేట నియోజకవర్గం నుంచి పాలచర్ల నాగేంద్ర బాబు, పిఠాపురం నియోజకవర్గం నుంచి తూము అప్పారావు, తోలేటి శిరీష, మడకశిర నుంచి హెచ్.రామాంజ నేయులు, ఒంగోలు నుంచి తేలకుట్ల అనాథమ్మ, పాయకరావుపేట నుంచి గెడ్డం అప్పారావు, రంపచోడవరం నుంచి గోదేటి భగవత్, మాడుగుల నుంచి రెడ్డి ఎరుకమ్మ, తుని నుంచి ఇముడుగపల్లి లోవకుమారి, మండపేట నుంచి యరగటపు బాబ్జీ, కైకలూరు నుంచి బండి లక్ష్మీ, కృష్ణా జిల్లా గన్నవరం నుంచి తుల్లిమిల్లి ఝాన్సీలక్ష్మి, కామర్సు చిరంజీవి రావు నియమితులు అయ్యారు. ఈ నియమిత పదవుల కూర్పులో ఎన్.డి.ఎ. కూటమిలోని తెలుగు దేశం, జనసేన, భారతీయ జనతా పార్టీ నేతలకు సమప్రాధాన్యం ఇస్తూ, సామాజిక వర్గాల రిజర్వేషన్ల సమన్వయాన్ని కూడా పాటించినట్లు కనిపిస్తోంది. ఐతే ఈ మేరకు పాలకవర్గం నియామకం గురించి మాత్రం ప్రత్యేక ఉత్తర్వులను విడుదల చేస్తూ ఈ నియామకాన్ని, పదవీ ప్రమాణ తేదీని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ అధీకృతంగా ప్రకటించాల్సి ఉంది.

**పర్వత సురేష్ సేవలకు పదవితో గుర్తింపు...**

తూర్పు గోదావరి జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం తెలుగు దేశం పార్టీలో 1985 నుంచి 2019 శాసనసభ ఎన్నికల వరకూ తెలుగు దేశం పార్టీకి క్రియాశీలక బాధ్యతలు నిర్వహించిన పర్వత సురేష్ రాజకీయంగా కనుమరుగు అయ్యారు. 1994 లో తెలుగు దేశం పార్టీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థిగ పర్వత సుబ్బారావు బరిలో ఉన్నది మొదలుకొని, ఎమ్మెల్యే పదవి ఐదేళ్ళూ ఆయనకు వ్యక్తిగత కార్యదర్శిగా సురేశ్ పని చేశారు. సుబ్బారావు సతీమణి పర్వత బాపనమ్మ శంఖవరం ఎంపీపీగా (01.04.195 - 11.10.99) పని చేసిన కాలంలోనూ, ఆమె ప్రత్తిపాడు ఎమ్మెల్యేగా (1999 - 2004) పని చేసిన కాలంలోనూ, స్వర్గీయ పర్వత శ్రీసత్యనారాయణ మూర్తి (చిట్టిబాబు) శంఖవరం ఎంపీపీగా (22.06.2001 - 21.07.2006) పని చేసిన కాలంలోనూ, అలాగే ఆయన ప్రత్తిపాడు ఎమ్మెల్యేగా (2009 - 2014) పని చేసిన కాలంలోనూ, 2014 ఎన్నికల్లో పర్వత చిట్టిబాబు ఎమ్మెల్యేగా ఓటమి పాలై, తూర్పు గోదావరి జిల్లా తెలుగు దేశం పార్టీ అధ్యక్షునిగా కొనసాగుతూ 13 మార్చి 2016 లో మరణించే వరకూ వీరందరికీ నిరవధికంగా పర్వత సురేష్ వ్యక్తిగత కార్యదర్శిగా పనిచేస్తూ వచ్చారు. సురేష్ పార్టీకి అందించిన సేవలకు గుర్తింపుగా 1995 లో ప్రత్తిపాడు నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ సమన్వయ కమిటీ సమన్వయకర్త, ఆ తర్వాత తెలుగు దేశం పార్టీ పూర్వపు ఉభయ గోదావరి జిల్లాల పార్టీ ప్రచార కార్యదర్శి వంటి పార్టీ పదవులు సురేష్ ను వరించాయి. ఆయన కూడా శక్తివంచన లేకుండా వాటిని సమర్ధవంతంగా నిర్వహిస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తూ వస్తున్నారు. 2014 ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా ఎన్నికైన వరుపుల సుబ్బారావు ఆ పార్టీ నుంచి ఫిరాయించి చిట్టిబాబు మరణానంతరం అధికార తెలుగు పార్టీలో చేరారు. అప్పుడు ఎమ్మెల్యే వరుపులకు తోటకూర వీరబాబు వ్యక్తిగత కార్యదర్శిగా పని చేసారు. ఐనప్పటికీ తెలుగు దేశం పార్టీ క్రియాశీలక కార్యకర్తగా వరుపులతో సాన్నిహిత్యాన్ని, అనుచరత్వాన్ని సురేష్ కొనసాగిస్తూనే పార్టీలో తనదైన శైలి, హవా, ప్రాధాన్యత ఏమాత్రం తగ్గలేదు అనిపించుకున్నారు . పార్టీ ఎదుగుదలకు తన వంతు కృషి చేసిన సురేష్ అంతే సమానంగా సమాంతరంగా తన వ్యక్తిగత ఎదుగులపై దృష్టి సారించి వ్యవసాయ సేద్యాన్ని సుస్థిరంగా కొనసాగిస్తూ ఆర్థికంగా నిలదొక్కు కున్నారు. 2019 ఎన్నికల్లో ఇదే అధికార తెలుగు దేశం పార్టీ నుంచి సిట్టింగు ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావుకు బదులుగా ఆయన మనువడు, ప్రత్తిపాడు నియోజకవర్గం తెలుగు దేశం పార్టీ సమన్వయకర్త వరుపుల రాజాకు పార్టీ అధిష్ఠానం టికెట్ ఖరారులోనూ, 2024 శాసనసభ ఎన్నికల్లో వరుపుల రాజా సతీమణి సత్యప్రభకు కూడా ఎన్నికల వ్యూహకర్తగా, ప్రచార రథ సారథుల్లోనూ ఒకరుగా పర్వత సురేష్ "తనదైన పాత్ర" పోషించారు. ఆమె విజయానికి రేయింబవళ్లు కీలకంగా శ్రమించారు. సురేష్ తన స్వీయ రాజకీయ ప్రయాణంలో ఆది నుండి అంతం వరకూ ఒక్క తెలుగు దేశం పార్టీకే కట్టుబడి పని చేసిన చరిత్ర సొంతం కావడం వంటి ఓ అరుదైన ప్రత్యేకత కలిగి ఉన్నారు. ఐనప్పటికీ తెలుగు దేశం పార్టీ పూర్వపు ఉభయ గోదావరి జిల్లాల పార్టీ ప్రచార కార్యదర్శి పదవి తర్వాత మార్చి 2026 వరకూ ఆయనను పార్టీ పదవులు ఏవీ వరించలేదు. ప్రజాస్వామ్య ప్రాతినిధ్య పదవులను చేపట్టే అవకాశమూ కలిసిరాలేదు. ఎట్టకేలకు ఇన్నాళ్లకు తాజాగా అన్నవరం రత్నగిరి దేవస్థానం పాలక మండలి సభ్యుడు పదవి లభించింది. దీంతో నియోజక వర్గంలోని పార్టీ శ్రేణుల్లో పర్వత సురేష్ అభిమానుల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి.

# ఐసోలేషన్ వార్డులో ఉపకరణాలు బహుకరించిన స్వర్ణాంధ్ర



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అనాధలు వృద్ధులైన రోగులకు ప్రత్యేక సేవలు అందిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బందిని ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ రాజశేఖర్ కెనడి స్వర్ణాంధ్ర నిర్వాహకులు లైన్ డాక్టర్ గుబ్బల రాంబాబులు అభినందించారు. మంగళవారం ఉదయం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో అనాధవృద్ధుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక వార్డులో అవసరమైన ఉపకరణాలను స్వర్ణాంధ్ర సేవా సంస్థ అందించింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆసుపత్రి సలహా మండలి సభ్యులు అనూప్ కుమార్ జైను మాట్లాడుతూ ఎక్కడ సహాయం అవసరమో అక్కడ స్వర్ణాంధ్ర అండగా ఉండి సేవలందిస్తుందని ప్రశంసించారు. స్వర్ణాంధ్ర సేవా సంస్థ సమకూర్చిన స్ట్రక్చర్, దుస్తులు, డైపర్లు , సిబ్బందికి అందించారు. ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర ముఖ్య నిర్వాహకులు రాంబాబు మాట్లాడుతూ ఐసోలేషన్ వార్డు ఏర్పాటు అక్కడ పనిచేస్తున్న నర్సింగ్ సిబ్బంది సేవలు అమూల్యమైనవని అన్నారు. ఆ వార్డులో ఇంకా కావలసిన కప్బోర్డు త్వరలోనే స్వర్ణాంధ్ర సమకూర్చుందని భరోసా ఇచ్చారు. స్వర్ణాంధ్ర నిత్యాన్నదానం నేటికీ 2004 వరోజుకి చేరుకుందని రాంబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలాజీ అయ్యర్, డాక్టర్ అశోక్, మురళి, మేరా కుమారి, దివ్య, సింధు తదితరులు పాల్గొన్నారు.

# గౌతమి ఘాట్లో 200 మందికి ఉచిత ఆరోగ్య పరీక్షలు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని గౌతమి వాకర్స్ ఇంటర్నేషనల్ క్లబ్ మరియు గౌతమి ఘాట్ మహిళా వర్కర్స్ అండ్ యోగా క్లబ్ సంయుక్తంగా ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఇందులో భాగంగా 200 మందికి బీపీ, షుగర్, థైరాయిడ్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి మెన్స్ క్లబ్ ప్రెసిడెంట్ & 103 డిప్యూటీ గవర్నర్ కీర్తి అచ్చిరాజు (బాబ్జి) ఉమెన్స్ క్లబ్ ప్రెసిడెంట్ కంబాల రుద్రమదేవి ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్యఅతిథిగా వాకర్స్ ఇంటర్నేషనల్ ఫాస్ట్ ప్రెసిడెంట్ కోడూరి రంగారావు హాజరయ్యారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో జాబిల్లి హాస్పిటల్ వైద్యురాలు డాక్టర్ భారతి, డాక్టర్ సతీష్ హాజరై ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు.ఆరోగ్యం పై అవగాహన కలిగించే విషయాలను తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో మెన్స్ క్లబ్ ప్రెసిడెంట్ కీర్తి బాబ్జి, వైస్ ప్రెసిడెంట్ తొశీటెపు వెంకన్న బాబు, సెక్రటరీ జి. విజయకిరణ్, ట్రెజరర్ టి బాబురావు, జాయింట్ సెక్రటరీ ఈ. రామకృష్ణ, బి భాస్కర్ గుప్తా, సిహెచ్ వీరభద్రరావు, జాలి వాకర్ బివి గోపాలకృష్ణ, మహిళా క్లబ్ ప్రెసిడెంట్ కంబాల రుద్రమదేవి, బి.కనకదుర్గ, ట్రెజరర్ సుగ్గు కమల, ఎన్.సత్యవతి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

### శాంతియుత వాతావరణంలో

# అంబేడ్కర్ జయంతి జరుపుకోవాలి

### మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏప్రిల్ 14న జరగనున్న డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ జయంతి వేడుకలను ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, అత్యంత ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించుకోవాలని మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు పిలుపునిచ్చారు. తూర్పుగోదావరి జిల్లా, రాయవరం మండలంలో గల మాచవరం గ్రామ దళిత వాడలో మంగళవారం జయంతి ఉత్సవ కమిటీ సభ్యులతో ఎస్సై సురేష్ బాబు అధ్యక్షతన పోలీసులు సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ దొరరాజు, రాయవరం సబ్ ఇన్స్పెక్టర్ డి.సురేష్ బాబు కమిటీ సభ్యులకు పలు కీలక సూచనలు చేశారు జయంతి కార్యక్రమాల సందర్భంగా ఎటువంటి గొడవలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, ఊరేగింపులు, సభల నిర్వహణలో పోలీసుల ఆదేశాలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని. సమస్యలు ఎదురైతే వెంటనే పోలీసు యంత్రాంగానికి సమాచారం అందించి, వారితో సమన్వయం చేసుకోవాలని సూచించారు. గ్రామంలో ఆదర్శవంతంగా అంబేడ్కర్ జయంతిని పండుగ వాతావరణంలో, జరుపుకోవాలని సిఐ దొర రాజు సూచించారు. ఈ సమావేశంలో స్థానిక ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### సీతానగరం మండలంలో

# చెరువుల పూడికతీతకు రంగం సిద్ధం



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లా సీతానగరం మండల ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో భారతి ఆధ్వర్యంలో నీటి భద్రతపై సమీక్ష జరిగింది. ఏప్రిల్ 6 నుండి 100 రోజులపాటు చెరువుల పునరుద్ధరణ భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా పనులు చేపట్టాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకంతో కాలువల పూడికతీత, కట్టల బలోపేతం చేయాలన్నారు. నీటిమట్టం 3 నుంచి 6 మీటర్లకు పెంచడమే లక్ష్యమని సాగు నీటి సంఘాలు భాగస్వాములు కావాలని కోరారు.

### చినకొండేపూడిలో

# ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం చిన కొండేపూడిలోని వేదుళ్ళమ్మ చెరువు వీధిలో పాత విద్యుత్ స్తంభం రోడ్డుపైకి వంగి ప్రమాదకరంగా మారింది. వ్యవసాయ పనులకు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు .ఏదైనా అపశృతి జరగకముందే విద్యుత్ శాఖ అధికారులు స్పందించి స్తంభాన్ని తొలగించి కొత్తది ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. అధికారులు త్వరలో పరిశీలించి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

# వెదురుపాకలో పుంత రోడ్ల పరిశీలన

### నిర్మాణానికి వేగం పెంచాలని ఎమ్మెల్యే ఆదేశాలు



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరిజిల్లా, రాయవరం మండలం వెదురుపాక గ్రామంలో పుంత రోడ్ల నిర్మాణంపై రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు మంగళవారం స్థల పరిశీలన నిర్వహించారు. ఇటీవల గ్రామంలో పుంత రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభమైనప్పటికీ, దేవుడు కాలనీకి వెళ్లేందుకు సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో స్థానికుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో అధికారులతో కలిసి సంబంధిత మార్గాన్ని ప్రత్యక్షంగా పరిశీలించిన ఎమ్మెల్యే, అక్కడి పరిస్థితులను సమీక్షించారు. రహదారి నిర్మాణానికి ఆటంకంగా ఉన్న ఆక్రమణలను గుర్తించి, వాటిని తక్షణమే తొలగించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రహదారి సర్వేను స్వయంగా పర్యవేక్షించి, పనులను వేగవంతం చేయాలని సూచించారు. గ్రామ ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా మార్గం కల్పించేందుకు ఎటువంటి ఆలస్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరి చంటిరెడ్డి, వడ్డాది చిన్న కృష్ణంరాజు, సత్తి శ్రీనివాసరెడ్డి, కొవ్వూరి నాగేశ్వరరెడ్డి, రాయవరం మండల తహశీల్దార్ బి.వి భాస్కర్, రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఫలించిన ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కృషి

### అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ పరిధిలోకి పిఠాపురం రైల్వే స్టేషన్

### రూ. 37.25 కోట్లతో అభివృద్ధి పనులు - మారనున్న పిఠాపురం రైల్వే స్టేషన్ రూపురేఖలు



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి వర్యులు పవన్ కళ్యాణ్ కృషితో పిఠాపురం రైల్వే స్టేషన్ సకల సౌకర్యాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు కానుంది. పిఠాపురం స్టేషన్ ను అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ కింద అభివృద్ధి చేయాలని ఆయన చేసిన ప్రతిపాదనలకు కేంద్ర రైల్వే మంత్రిత్వశాఖ ఆమోదం తెలిపింది. రూ. 37.25 కోట్లతో స్టేషన్ లో మౌలిక వసతులు అభివృద్ధి చేయనుంది. గత పిఠాపురం పర్యటనలో పవన్ కళ్యాణ్ క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లిన సందర్భంలో రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలు అశుభ్రత, దుర్గంధం వెదజల్లుతుండడాన్ని చూశారు. రైల్వే స్టేషన్ పరిసరాలను తక్షణం శుభ్రం చేయాలని అధికారులను ఆదేశించారు. జనవరి నెలలో జరిగిన ఢిల్లీ పర్యటనలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తో సమావేశం సందర్భంగా పిఠాపురం రైల్వే స్టేషన్ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా చర్చించారు. ఆధ్యాత్మికంగా ముఖ్య పట్టణమైన పిఠాపురం రైల్వే స్టేషన్ కి దూర ప్రాంతాల నుంచి యాత్రికులు వస్తారని, వారి సౌకర్యార్ధం అమృత్ భారత్ పథకం కింద అభివృద్ధి చేయాలని కోరారు. పవన్ కళ్యాణ్ అభ్యర్ధన పట్ల సానుకూలంగా స్పందించిన కేంద్ర రైల్వే మంత్రిత్వశాఖ పిఠాపురం స్టేషన్ ను అమృత్ భారత్ స్టేషన్ గా అభివృద్ధి చేసేందుకు ముందుకు వచ్చింది. స్టేషన్ భవనం, ముఖద్వారం తోపాటు దివ్యాంగుల కోసం ప్రత్యేక సౌకర్యాలతో కూడిన విశ్రాంతిగది నిర్మాణం, అత్యాధునిక టాయిలెట్లు, డ్రైనేజీ వ్యవస్థ, కేబులింగ్, ప్లాట్ ఫారం అభివృద్ధి, షెల్టర్ల నిర్మాణం తదితర అభివృద్ధి పనులు చేపట్టనుంది. అడిగిన వెంటనే పిఠాపురం రైల్వే స్టేషన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేసేందుకు సహాయ సహకారాలు అందించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి, తక్షణం స్పందించిన రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కి, పిఠాపురం అభివృద్ధికి నిరంతర మద్దతు ఇస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు.

# ఒత్తిడి లేని జీవితం ఆరోగ్యానికి మూల కారణం

### ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా డిప్యూటీ డిఎంహెచ్‌వో ఎన్.ప్రశాంతి




**ఏలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆరోగ్యానికి మూల కారణం ఒత్తిడి లేని జీవితం గడపడమే అని, కాకినాడ జిల్లా డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ ఎన్ ప్రశాంతి పిలుపునిచ్చారు. ఈ మేరకు ప్రపంచ ఆరోగ్య దినోత్సవ సందర్భంగా స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వద్ద జే అన్నవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ర్యాలీ నిర్వహించారు.ఈర్యాలీలో డిప్యూటీ డిఎంహెచ్ఓ ఎన్ ప్రశాంతి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడిపేందుకు ఒత్తిడి లేకుండా తమ కుటుంబ సభ్యులతో గడపాలని ఆమె కోరారు. విజ్ఞానానికి అండగా నిలుద్దాం, ఆరోగ్యం కోసం కలిసి పని చేద్దాం, మంచి అలవాట్లు ఆరోగ్యానికి సోపానం అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సురేష్, వైద్యులు బి.శ్రీకాంత్, సిహెచ్ఓ పి.మాణిక్య కుమారి, హెల్త్ సూపర్వైజర్ కే.దైవ కృప, హెల్త్ అసిస్టెంట్లు పి.నానిబాబు, ఇ.జగదీష్, ఎన్ రాజేంద్రప్రసాద్, డి.రాజు, జి.రవికుమార్, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

# బుర్రిలంక యాదవులు శ్రీ గంగమ్మ తల్లికి సారె బహుకరణ



**కడియం, విశ్వం వాయిస్ న్యూస్ :** కడియం మండలం, బుర్రిలంక గ్రామంలో ఇటీవల నూతనంగా నిర్మించిన శ్రీగంగమ్మ తల్లికి పసుపు,కుంకుమ, చీర, వివిధ రకాల పండ్లు, పుష్పాలు,స్వీట్లతో పాటు గరగలతో యాదవులు వారి ఆడపడుచు అయిన గంగమ్మ తల్లికి సారె మంగళవారం సమర్పించారు.ఈ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం న్యాయ విభాగ అధ్యక్షులు దండుబోయిన వీర వెంకట సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ద్వాపర యుగములో యశోద గర్భంలో యోగమాయగా జన్మించి, కంసుడు వలన వధింపబడి, శ్రీకృష్ణుని వరంతో కలియుగంలో తిరుపతిలోని అవిరాల గ్రామంలో గంగమ్మ తిరిగి జన్మించిందని అన్నారు. అప్పట్లో పాలెగాళ్ళ పాలనలో వివాహమైన యువతులను మొదటి రాత్రి పాలెగాళ్లతో గడపవలసి వచ్చేదన్నారు. అటువంటి విధానాన్ని ఉగ్రరూపంలో గంగమ్మ వ్యతిరేకించింది. ఆమె నుండి తప్పించ ుకోవడానికి వివిధ వేషాలలో మారుస్తూ పాలెగాళ్ళ నాయకుడు దాక్కున్నాడట. అలా పారిపోయిన పాలేగాడిని బయటికి రప్పించేందుకు వేరువేరు రూపాలు ధరించి వారం రోజుల అనంతరం పాలేగాడిని ఆమె సంహరించారని అన్నారు. అందువల్ల తిరుపతిలో గ్రామ దేవతగా ప్రతిష్టింపబడి నిత్య పూజలు అందుకుంటున్న, గంగమ్మ అమ్మవారిని దర్శనం చేసుకున్న తరువాతనే వెంకటేశ్వర స్వామిని దర్శనం చేసుకోవాలన్నారు. అటువంటి యాదవుల ఆడపడుచు గంగమ్మకు తమ గ్రామంలో యాదవుల తరఫున సారెను సమర్పించడం మా కుటుంబానికి కలిగిన అదృష్టమన్నారు. ఆమెను పూజించిన ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో,అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాతారని అన్నారు.ఈ కార్యక్రమంలో తానంకి శ్రీనివాస్, తానంకి నాగేశ్వరరావు, నూని నాగేశ్వరరావు , నూని ప్రభు, తానంకి రాధాకృష్ణ, నూని వెంకటేశ్వరరావు, అలాగే గ్రామములో యాదవులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

# ఓటును ఓటరే వేస్తున్నాడా.! ఈవిఎం వేసుకుంటుందా..!

### - ఓటు భద్రత లేని ప్రజాస్వామ్యం - ఆటవిక దోపిడి రాజ్యం గానే ఉంటుంది : మేడా



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మోదీ పాలనలో నేతలను ఎన్నుకుంటున్నారా ! కొనుక్కుంటున్నారా ! 2029 - ఎన్నికలకు ఇదే తరహా ఎన్నికలు నిర్వహిస్తే మళ్ళి మీరే గెలిచేది . అందుకోసం ఎన్నికలు నిర్వహించటం ఎందుకు..భారతదేశంలో ప్రజాస్వామ్యం సమాధిగా మారుతుంది . అప్రజాస్వామ్యమే పాలిస్తుంది. అపార సంపద గల భారతదేశంలో పేదలు అత్యధిక శాతం ఉండటానికి కారణం ఏమిటో తెలుసుకోగలమా! ఆంధ్రప్రదేశ్ - తెలంగాణా లో కుల సంఘాలు శాపం అయితే ఇతర రాష్ట్రాల్లో మతోన్మాద ఉన్మాదం శాపంగా మారింది.. ఆంధ్రప్రదేశ్ - తెలంగాణా రాష్ట్రాల్లో ఒకప్పటి ఉద్యమ త్యాగాలు , నేతల స్ఫూర్తి నేడు ఎందుకు కనుమరుగు అవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ లో మేధావులు అసలు ఉన్నారా ! ఉంటే ఎందుకు మౌనంగా వుంటున్నారు. భయపడుతున్న ఆంధ్రులకు భరోసా ఇచ్చే మహానేత నేడు కావాలి. స్వేచ్ఛగా మీడియా పాత్ర పోషించ లేక పోతున్న నేటి స్థితుల నుండి మీడియా వుంది అని నిరూపించే మహోన్నతమైన బంగారు రోజులు మన బిడ్డలకు, మెరుగైన సమాజానికి కానుకగా ఇద్దాం. రోజులు మారుతున్నాయి. నెల ఇట్టే తిరుగుతుంది. జీవితాలు మాత్రం మారటం లేదు. ఏడాది కొకసారి ఎన్నికలు జరిగితే బాగుండును అనే ఆశ, దురాశకు ప్రజలను దిక్కులేని బానిసత్వానికి అలవాటు పడే లా చేస్తున్నారు. చట్ట భద్రత లేదు. పౌర సేవలు లేవు. పౌష్టిక ఆహారం లేదు. కనీస వసతులు , మౌలిక సదుపాయాలు లేవు. పర్యావరణ రక్షణ లేక పోయింది. విద్యా - వైద్యం ఖరీదైన దోపిడి వ్యవస్థలుగా మారిపోయాయి. మనది ప్రజాస్వామ్యం అని బ్రతికేస్తు కుమిలి పోతున్నాము . ప్రస్తుత పాలన ప్రజాస్వామ్యం ఎలా అవుతుంది. భారతదేశ రాజ్యాంగం సాక్షిగా చట్ట పరమైన హక్కును దేహి అని ఆడుకున్నా దక్కటం లేదు. న్యాయం ఖరీదైనదిగా మారి పోయి సామన్యుల జీవితాలను నిత్యం వెక్కిరిస్తుంది. ఆంధ్రప్రదేశ్ - తెలంగాణా రాష్ట్రాల్లో మెజారిటీ ప్రజలు ప్రస్తుత పాలక నేతలకు ఎందుకు జై జైలు కొడుతున్నారో ఆత్మ విమర్శ చేసుకునే మనస్సాక్షిని చాటుకునే దైవ సాక్షాన్ని చెప్పుకోగలరా ! ఒకప్పుడు రాజకీయ పార్టి లకు ఒక సిద్ధాంతం ఉండేది . నేడు పుట్టుకోస్తున్న రాజకీయ పార్టిలు పాలక వ్యాపార రాజకీయ పార్టి లకు బానిస తోత్తులుగా ఉంటాం. ప్రజలను వ్యవస్థలను , సమాజాన్ని మోసం చేస్తు మీకు విధేయులుగా బ్రతికేస్తాం అని నెల పారితోషకాలుతో పెద్ద పెద్ద ఉపన్యాసాలు గుప్పిస్తు పూర్వ సినిమా వారిని మించిన నటనతో ప్రజలను సమాజాన్ని మోసం చేస్తున్నారు. గత 28 ఏళ్లగా నమ్మిన సిద్ధాంతం కోసం , సంపద అందరి దరికి చేరాలని , సమ సమాన పాలనతో మనుషులు రాజ్యాంగ బద్ధమైన స్వేచ్ఛతో జీవించాలని, కులం - మతం రహితంగా అద్భుతమైన సామాజిక భద్రత, భవిష్యత్తే లక్ష్యంగా నిరంతరం పోరాడుతున్న " రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ " కు ప్రజలు వెన్నుదన్నుగా నిలబడి ప్రోత్సహించాలని కోరుతున్నాము..



# నగరంలో అంతర్జాతీయ డ్రాగన్ బోట్ లీగ్ - 2026 సిద్ధం

- ప్రపంచ దృష్టి రాజమహేంద్రవరం వైపు - మే 30 నుంచి జూన్ 1 వరకు పోటీలు
- 25 దేశాల నుంచి 1200 మంది అథ్లెట్ల హాజరు - ఈ అంతర్జాతీయ క్రీడతో యువతకు కొత్త ఉత్సాహం
- నగరంలో మల్టీ పర్పస్ స్టేడియం నిర్మాణానికి శ్రీకారం - ఏపీని స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా చారిత్రాత్మక అడుగు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం నగరం అంతర్జాతీయ క్రీడా వేదికగా అవతరించబోతోంది. మే 30 నుంచి జూన్ 1 వరకు నిర్వహించనున్న ఇంటర్నేషనల్ డ్రాగన్ బోట్ లీగ్–2026తో ప్రపంచ దృష్టి ఈ నగరంపై పడనుంది. 25 దేశాల నుంచి సుమారు 1200 మంది అథ్లెట్లు పాల్గొననున్న ఈ పోటీలు నగరానికి విశిష్ట గుర్తింపు తీసుకురానున్నాయని ప్రజా ప్రతినిధులు తెలిపారు. ఈ ఈవెంట్ ద్వారా యువతలో క్రీడల పట్ల ఆసక్తి పెంపొందడంతో పాటు, ఆరోగ్యకర జీవనశైలికి దారితీసే కొత్త ఉత్సాహం కలుగుతుందని పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జైలు రోడ్డులోని మంజీర హోటల్‌లో థింక్ అవుట్ సైడ్, ఇండియన్ కయాకింగ్ అండ్ కానోయింగ్ అసోసి యేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ పోటీలకు సంబంధించిన లోగో, జెర్సీ, టీజర్, అధికారిక బ్యానర్‌ను ప్రజా ప్రతినిధులు ఆవిష్కరించారు. అలాగే ఈవెంట్‌కు సంబంధించిన వెబ్‌సైట్, సోషల్ మీడియా ప్రచార కార్యక్రమాలను ప్రారంభించారు. చైనాలో ఆవిర్భవించిన డ్రాగన్ బోట్ క్రీడకు దాదాపు 2000 ఏళ్ల చరిత్ర ఉందని, టీమ్ స్పిరిట్, సమన్వయం, ఏకాగ్రతకు ఇది ప్రతీకగా నిలుస్తుందని నిర్వాహకులు వివరించారు. ఈ సందర్భంగా రాజమండ్రి పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురంధేశ్వరి మాట్లాడుతూ రాజమహేంద్రవరం ఇప్పటివరకు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కేంద్రంగా పేరుపొందిందని, ఈ లీగ్ ద్వారా క్రీడా రంగంలోనూ గుర్తింపు పొందే దిశగా ముందడుగు వేస్తుందని అన్నారు. క్రీడలు యువతను మాదక ద్రవ్యాల నుంచి దూరంగా ఉంచి ఆరోగ్యవంతమైన జీవన విధానానికి దారి చూపుతాయని పేర్కొన్నారు. నగరంలో మూడు దశల్లో మల్టీ పర్పస్ స్టేడియం నిర్మాణం చేపడుతున్నామని, ఇప్పటికే మొదటి, రెండో దశలకు నిధులు విడుదలైనట్లు తెలిపారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ రాజమహేంద్రవరాన్ని క్రీడా రాజధానిగా తీర్చిదిద్దేందుకు అన్ని అవకాశాలు ఉన్నాయని చెప్పారు. గోదావరి రివర్ ఫ్రంట్ అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని, నారాయణపురంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రారంభించామని తెలిపారు. ఈ ఈవెంట్ 2027 గోదావరి పుష్కరాలకు నాందిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రపంచ దేశాల నుంచి వచ్చే క్రీడాకారులకు నగర ప్రజలు ఆతిథ్య సత్కారం అందించాలని పిలుపునిచ్చారు. శాప్ చైర్మన్ రవి నాయుడు మాట్లాడుతూ రాజమహేంద్రవరాన్ని వాటర్ గేమ్స్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనే అంతర్జాతీయ అథ్లెట్ల సంఖ్య రాష్ట్రానికి గర్వకారణమని పేర్కొన్నారు. రూ.53 కోట్ల వ్యయంతో ఇండోర్ స్టేడియం నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం క్రీడా రంగానికి పూర్తి మద్దతు ఇస్తోందని, ఎంపీ పురంధేశ్వరి కృషితో మల్టీ పర్పస్ స్టేడియంకు నిధులు మంజూరైనట్లు తెలిపారు. రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ ఈ ఈవెంట్ ద్వారా పర్యాటక రంగం అభివృద్ధి చెందడంతో పాటు పెట్టుబడులు ఆకర్షితమవు తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఏపీ శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, కూటమి నాయకులు కాశీ నవీన్ కుమార్, వర్రే శ్రీనివాసరావు, పిక్కి నాగేంద్ర, అత్తి సత్యనారాయణ, వై శ్రీను, ఉప్పులూరి జానకీ రామయ్య, అధికారులు, సామాజిక మాధ్యమ ప్రభావశీలులు తదితరులు పాల్గొన్నారు.

### కళాకారులను ప్రోత్సహించడం

# మనందరి బాధ్యత

**శోభిత్ వర్మ చారిటబుల్ ట్రస్ట్ అధ్యర్యంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి దుర్గేష్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరంలోని జ్ఞాన సరస్వతి ఘాట్ వద్ద శోభిత్ వర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి దుర్గేష్, సోగ్గాడే చిన్ని నాయన డైరెక్టర్ కల్యాణ కృష్ణ, సామ్రాట్ శ్రీనివాసరాజు, కనకయ్య, రూత్విక్ రాజు పాల్గొన్నారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు చల్లగాలి శ్రీనివాస్ వర్మ, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సభలో పలువురు కళాకారులను మంత్రి కందుల దుర్గేష్ జ్ఞాపికలతో సత్కరించారు. సమాజ సేవలోను, కళా రంగంలోనూ రాణిస్తున్న పలువురు ప్రతిభావంతులకు 'సేవా పురస్కారాలను' అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులుమంత్రి దుర్గేష్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. కళలను ఆదరించడం, కళాకారులను ప్రోత్సహించడం మనందరి బాధ్యతని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ కొనియాడారు. ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టం కోసం కృషి చేస్తున్న శ్రీమతి ఆకుల విజయభారతి, విద్యారంగంలో పేదల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న మెరుగుమళ్ళ బ్యూలారత్నం, శ్రీమునీష్‌లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో సత్తిరాజు, డి ఎస్ పి రావు, కృష్ణ మాచార్యులు, కె. రాధికా స్థానిక నాయకులు, ట్రస్ట్ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు మరియు కళాకారులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

**ప్రభుత్వం సబ్సిడీపై రైతులకు విత్తనాలను పంపిణీ**

**తొర్రేడు గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గోరంట్ల**



**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రూరల్ శాసన సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. మంగళవారం ఉదయం తొర్రేడు గ్రామంలో సచివాలయం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే గోరంట్ల ప్రారంభించారు. ఆ సందర్భం గా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ యుద్ధం ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా ఎగుమతులు ఆగిపోయాయని, అయిన ప్పటికీ కూడా రైతులను ఆదుకునే విధంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వారి సారథ్యంలో కూటమి ప్రభుత్వ కృషితో కేంద్రం నిర్ణయించిన మంచి మద్దతు ధరతో రైతుల వద్ద నుండి ధాన్యం కొనుగోలు చేస్తున్నా మని తెలిపారు. గత ప్రభుత్వం రైతు లను నట్టేట ముంచేసిందని, రైతులకు కనీస గిట్టుబాటు ధర కల్పించకుండా మిల్లులకు తోలిన ధాన్యానికి సొమ్ములు చెల్లించకుండా నెలల తరబడి కాలయాపన చేసి రైతులను దగా చేసిందని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతులకు బడ్జెట్ కేటాయింపులో కూడా పెద్దపీట వేసిందని, రైతు వద్ద నుండి ధాన్యాన్ని మిల్లుకు చేర్చిన 48 గంటల లోపు సొమ్ములు రైతులు ఖాతాలోకి చేరుతున్నాయని తెలిపారు. రైతులందరూ వరి పంట మాత్రమే కాకుండా ప్రత్యామ్నాయ పంటలపై కూడా అవగాహన పెంచుకోవాలని కోరారు. అనంతరం ప్రభుత్వం సబ్సిడీపై రైతులకు అందించే విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి ముళ్లపూడి వెంకటరమణ, వ్యవసాయ సహాయ సంచాలకులు కే.సూర్య రమేష్, ఎమ్మార్వో శ్రీనివాస్, కురుకూరి కిషోర్, కొత్తపల్లి సత్యనారాయణ, దండమూడి బాపినీడు, సొసైటీ సీఈఓ కొడవలి సత్యనారాయణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గంగిన జాహ్నవి, మద్దుకూరి లక్ష్మణ్, సుంకవల్లి చిన్నారి, మద్దూకూరి నరసింహ రావు, దండమూడి రఘుబాబు, పోలిన సూరిబాబు, గెడ సత్యనారాయణ, దాసరి గురుప్రసాద్, మొగలపు శ్రీనివాస్, పాలడుగుల గాంధీ, యువగళం టీం సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### రాజ్యాంగం కల్పించిన హక్కు ప్రకారం

# ఎవరూ ఏ మతాన్నైనా అనుసరించే హక్కు ఉంది

**- దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్లు పునరుద్ధరించాల్సిందే.. - కాంగ్రెస్ అఖిల పక్ష సమావేశంలో నాయకుల డిమాండ్**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా ప్రజలకు కల్పించిన హక్కులను కాలరాసేలా దేశంలో పాలన సాగుతోందని కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన అఖిల పక్ష సమావేశంలో పలు రాజకీయ పార్టీలు, క్రైస్తవ సంఘాలు, పాస్టర్లు, ప్రజా సంఘాలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేసారు. రాజమండ్రి అర్బన్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ అధ్యక్షతన స్థానిక ఎపి పేపర్ మిల్లు ఎదురుగా ఉన్న కృష్ణసాయి కళ్యాణ మండపంలో మంగళవారం అఖిల పక్ష పార్టీల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కాంగ్రెస్ రాజమండ్రి పార్లమెంట్ కో ఆర్డినేటర్ డాక్టర్ టీ.కే విశ్వేశ్వరరెడ్డి, సిపిఐ రాష్ట్ర నాయకుడు టి.మధు, సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, చాంబర్ మాజీ అధ్యక్షుడు అశోక్‌కుమార్ జైన్, కెకె సంజీవరావు, ప్రజా సంఘాల ఐక్యవేదిక వ్యవస్థాపకుడు దేశిరెడ్డి బలరామ నాయుడు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు తాళ్లూరి విజయకుమార్ సిపిఐ, సిపిఎం, ఆమ్ ఆద్మీ పార్టీల నాయకులు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునర్ సమీక్ష చేసేలా కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని డిమాండ్ చేసారు. దేశంలో రాజ్యాంగం కల్పించిన హక్కు ప్రకారం ఎవరూ ఏ మతాన్నైనా అనుసరించే హక్కు ఉందని, మతం ప్రకారం రిజర్వేషన్లు వర్తించవని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం దారుణమని తీవ్రంగా ఖండించారు. పార్లమెంట్‌లో దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్లు కల్పించేలా చర్చించి రాజ్యాంగాన్ని సవరణ చేపట్టాలని డిమాండ్ చేసారు. దేశవ్యాప్తంగా దీనిపై పోరాటం చేయడానికి అందరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రజల ప్రజాస్వామ్య హక్కులను కాలరాసేందుకు ఎవరికి అవకాశం ఉండకూడదన్నారు. మతం మారితే రిజర్వేషన్లు కోల్పోవాలనే నిర్ణయం తీసుకోవాన్ని పెద్ద కుట్రగా అభివర్ణించారు. దీనిపై తక్షణం ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి అసెంబ్లీలో తీర్మానం చేయించాలని డిమాండ్ చేసారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్లు పునరుద్ధరించే వరకు అఖిల పక్ష కమిటీ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేసారు. రాజమహేంద్రవరం నగరపాలకసంస్థకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని కూడా సమావేశంలో తీర్మానం చేసారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు మార్టిన్ లూథర్, డాక్టర్ వడయార్, బెజవాడ రంగారావు, వివిధ పక్షాల నాయకులు పవన్, కొండలరావు, కూండ్రపు రాంబాబు, పూర్ణిమారాజ్, సింధియా రాణి, శ్రీనివాస్, యాళ్ల వీరభద్రరావు, నిల్లా వీర్రాజు, తాడి సూరిబాబు, బర్రే సుబ్రహ్మణ్యం, నల్లా రామారావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు ఆరోగ్యసంరక్షణపై అవగాహన కల్పించడంలో

# పీఎంపీల పాత్ర కీలకం

**పీఎంపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రాధమికంగా చికిత్స లందించే పీఎంపీలు ఈ ఏడాది వరల్డ్ హెల్త్ డే నినాదం "ఆరోగ్యం కోసం ఏకమవుదాం విజ్ఞాన శాస్త్రానికి మద్దతుగా నిలుద్దాం" ప్రకారం ప్రజలందరి ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం,శాస్త్రీయంగా ఆలోచిద్దామని పీఎంపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు పిలుపునిచ్చారు.ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం హుక్కుంపేట గోదావరి రుచులు కాన్ఫరెన్స్ హాల్ నందు కమ్యూనిటీ పారామెడిక్స్ & ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పియంపి అసోసియేషన్) రాజమండ్రి ఆధ్వర్యంలో మండల అధ్యక్షులు అబ్దుల్ రహమాన్ ఖాన్ అధ్యక్షతన వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సదస్సులో ముఖ్య అతిధిగా హాజరైన వీబీటీ రాజు మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యానికి వైద్య విజ్ఞాన అవగాహన ఎంతో అవసరమని, సురక్షితమైన శాస్త్రీయమైన వైద్య విధానాలతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని అన్నారు.నేటి జీవనశైలి లో మార్పులు వలన అనారోగ్యం బారిన పడడం జరుగుతుందని, ప్రకృతి పరిరక్షించుకుంటూ, పర్యావరణాన్ని కాపాడుకుంటూ ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించాలని కోరారు. సత్య కిడ్నీ అండ్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ వైద్యనిపుణులు డాక్టర్ సత్య ప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ జీవనశైలి లో వచ్చిన మార్పుల వలన మూత్రపిండాలకు వచ్చే వ్యాధుల గురించి, మూత్రపిండాలకు, మూత్రనాళాలకు, కిడ్నీలో రాళ్ళకు చేసే శస్త్రచికిత్స గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తోరాటి ప్రభాకరరావు, జిల్లా అధ్యక్షులు బళ్ళా శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పీ దేవానందం,జిల్లా కోశాధికారి పి.చిన్ని,మండల కార్యదర్శి మట్టా రమేష్, మండల కోశాధికారి యు ప్రసాద్ బాబు, కేఎస్ఎస్ఎన్ రెడ్డి, ఏ.సురేష్ బాబు,సుంకర శ్రీనివాస్,హాస్పిటల్ మేనేజర్ మూర్తి లతో పాటు సభ్యులు పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ సత్య ప్రసాద్ ను సభ్యులు ఘనంగా సత్కరించారు.

# సీతానగరం పిహెచ్‌సి సిబ్బందికి నా ధన్యవాదాలు

**డాక్టర్ ఏవీకే చైతన్య**




**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఏ వీకే చైతన్య ఉన్నత చదువుల( పోస్ట్ గ్రాడ్యుయేషన్) కోసం సీతానగరం పిహెచ్సి నుండి రిలీవ్ అవ్వడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ చైతన్య మాట్లాడుతూ సీతానగరం మండలంలో ఆరు సంవత్సరాల సుదీర్ఘ కాలం పాటు ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడానికి ఎంతో సహకరించిన పీహెచ్సీ సిబ్బందికి, అధికారులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఇంతకాలం తమను కన్నబిడ్డలుగా చూసుకున్న డాక్టర్ చైతన్యకు సిబ్బంది ధన్యవా దాలు తెలియజే సుకుంటూ వీడ్కోలు పలికారు.కాతేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఆర్. జగదీష్ కృష్ణ కు సీతానగరం పిహెచ్సి బాధ్యతలు తాత్కాలికంగా అప్పజెప్పడం జరిగింది.

# రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో వరల్డ్ హెల్త్ డే



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తూర్పుగోదావరి జిల్లా చైర్మన్ డాక్టర్ జి.తరుణ్ ఆధ్వర్యంలో మంగళవారం గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ గైట్ కాలేజీ మెకానికల్ బ్రాంచ్ నందు బేసిక్ ఫస్ట్ ఎయిడ్ శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ పి శ్రీనివాసరావు బేసిక్ లైఫ్ సపోర్ట్ లో ఎవరికైనా ఇబ్బంది వచ్చినప్పుడు సీపీఆర్ ఎలా ఇవ్వాలో శిక్షణను ఇచ్చారు.అలాగే కుక్క కాటుకి,పాము కాటుకి అందించే ప్రథమ చికిత్స గురించి తెలిపారు. డాక్టర్ వసంత, డాక్టర్ పూజారావు శిక్షణకు సహకరించారు.రెడ్ క్రాస్ జిల్లా కోశాధికారి డాక్టర్ జి మహాలక్ష్మి రెడ్ క్రాస్ విధివిధానాలు గురించి, ఆందిస్తున్న సేవల గురించి వివరించారు. ప్రతి విద్యార్థి యూత్ రెడ్ క్రాస్ లో సభ్యులు గా జాయిన్ అవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ గోపీకృష్ణ, కె శివ,మెకానికల్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ హెచ్ఓడీ మరియు శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చిన్న కొండేపుడిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం చిన్నకుండే పూడిలో మంగళవారం రబీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. శ్రీ రామకృష్ణ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో సొసైటీ చైర్మన్ కాంద్రు శేఖర్ ఈ కార్యక్రమం నిర్వహించారు. రైతులు ధాన్యాన్ని నిర్ణీత తేమశాతంతో అవసరమైన పత్రాలతో కేంద్రానికి తీసుకురావాలని అధికారులు సూచించారు.రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యంగా ఈ కేంద్రం పనిచేస్తుందని తెలిపారు.





# ఆ ప్రేమను ఎప్పటికీ మర్చిపోలేను..

## నాకు నేనే సర్‌ప్రైజ్ అవ్వడం ఇష్టం అంటున్న మృణాల్

'డెకాయిట్'లో చేసిన సరస్వతి క్యారెక్టర్ నా కెరీర్‌లో గుర్తుండిపోతుంది. ఇందులో రిస్కీ యాక్షన్ స్టంట్స్ చేశాను. ఆడియన్స్ ఖచ్చితంగా ఎంజాయ్ చేస్తారని హీరోయిన్ మృణాల్ ఠాకూర్ చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఈ అమ్మడు డెకాయిట్ సినిమా పైనే ఆశాలుపెట్టుకుంది. ఈ సినిమా ఏప్రిల్ 10న పేక్షకుల ముందుకు రానుంది. బ్యాక్ టు బ్యాక్ పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్లతో అలరిస్తున్న అడివి శేష్ పాన్-ఇండియా యాక్షన్-రొమాంటిక్ థ్రిల్లర్ 'డెకాయిట్'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ చిత్రంతో షానియల్ డియో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. శేష్ సరసన మృణాల్ ఠాకూర్ హీరోయిన్ గా నటించారు. అనురాగ్ కశ్యప్ కీలక పాత్ర పోషించారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో ఈ చిత్రాన్ని సుప్రియ యార్లగడ్డ నిర్మించగా, సునీల్ నారంగ్ సహ నిర్మాతగా వ్యవహరించారు. ఈ సినిమాటీజర్ ట్రైలర్ పాటలు సినిమాపై భారీ అంచనాలు పెంచాయి. డెకాయిట్ ఏప్రిల్ 10న థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ మృణాల్ ఠాకూర్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు. డెకాయిట్‌లో చేసిన సరస్వతి క్యారెక్టర్ చాలా డిఫికల్ట్. అయితే మేకర్స్ ఆ క్యారెక్టర్‌ను యాక్టర్‌కు సులభంగా అర్థమయ్యేలా తీర్చిదిద్దారు. ఒక యాక్టర్‌కు ఛాలెంజ్ ఉన్న క్యారెక్టర్ చేయడం ఎప్పుడూ ఆనందాన్ని ఇస్తుంది. సరస్వతి క్యారెక్టర్ చేయడం నాకు చాలా సంతోషాన్ని ఇచ్చింది. ఈ క్యారెక్టర్‌ను చాలా ఎంజాయ్ చేస్తూ చేశాను. నా కెరీర్‌లో ఇది చాలా డిఫరెంట్ రోల్. ఇప్పటివరకు నేను చేయని కొత్త జానర్ ఇది. తప్పకుండా ఈ క్యారెక్టర్ అందరికీ నచ్చుతుందని నమ్ముతున్నాను. ఈ సినిమాలో కొన్ని స్టంట్స్ కూడా చేశాను. చేజింగ్ సన్నివేశాలు, డ్రైవింగ్ సీన్స్ చాలా ఎంజాయ్ చేశాను. సీతారామం, హాయ్ నాన్న, ఫ్యామిలీ స్టార్ చిత్రాలతో తెలుగు ఆడియన్స్ నన్ను ఒక తెలుగు అమ్మాయి లాగా అంగీకరించారు. వారి ప్రేమాభిమానాలు ఎప్పటికీ మర్చిపోలేను. మంచి పాత్రలు చేస్తాననే నమ్మకం వారికి ఉంది. సరస్వతి పాత్ర కూడా అందర్నీ ఆకట్టుకుంటుంది. నాకు ఎప్పుడూ ఎక్స్‌పెరిమెంట్ చేయాలని ఉంటుంది. అలాగే నాకు నేనే సర్‌ప్రైజ్ అవ్వడం ఇష్టం. అలాంటి అవకాశం ఇచ్చిన సినిమా ఇది. నాకు కొత్త ఎమోషన్స్ ఉన్న సినిమాలు చేయాలనిపిస్తుంది. ఇప్పటివరకు చేయని క్యారెక్టర్లు చేయాలనే తపన ఉంటుంది. డెకాయిట్ కూడా అలాంటి కొత్త జానర్ సినిమా అని చెప్పుకొచ్చింది మృణాల్.

# చావుకు మరో ఏడాది దగ్గరయ్యాను..


## రామ్ గోపాల్ వర్మ షాకింగ్ పోస్ట్



సినిమాలు చేయకున్నా తరచూ తన కామెంట్స్, సోషల్ మీడియా పోస్టులతో వార్తల్లో నిలుస్తున్నారు సెన్సేషనల్ డైరెక్టర్ రామ్ గోపాల్ వర్మ. ముఖ్యంగా ఇటీవల ధురంధర్ 2 సినిమాపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నాడు ఆర్జీవీ. అయితే తాజాగా ఆయన చేసిన ఒక ట్వీట్ హాట్ టాపిక్ గా మారింది. టాలీవుడ్ డైరెక్టర్ రామ్ గోపాల్ వర్మ గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. ఒకప్పుడు శివ, రంగీలా, క్షణ క్షణం వంటి దేశం గర్వించదగ్గ సినిమాలు తీసిన ఆయన విలక్షణ దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే అదంతా గతంలా మారిపోయింది. ఇప్పుడు ఆయన సినిమాలపై పట్టు కోల్పోయారు. బయోపిక్స్, పొలిటికల్ స్టోరీలంటూ సినిమాలు తీయడం తప్ప విజయాలు అందుకోలేకపోతున్నారు. ఆర్జీవీ కమ్ బ్యాక్ ఇస్తే చూడాలని సందీప్ రెడ్డి వంగా లాంటి ప్రముఖులతో పాటు అభిమానులు ఎంతగానో కోరుకుంటున్నారు. ఇదిలా ఉంటే సినిమాలు చేయకున్నా తరచూ తన కామెంట్స్, సోషల్ మీడియా పోస్టులతో వార్తల్లో ఉంటున్నారు రామ్ గోపాల్ వర్మ. ముఖ్యంగా ఇటీవల ధురంధర్ 2 సినిమాపై వరుసగా పోస్టులు పెడుతున్నారాయన. ఆ సినిమాను చూసి దర్శక నిర్మాతలు భయపడుతున్నారంటూ సెటైర్లు వేస్తున్నారు. వీటిపై చర్చ జరుగుతుండగానే సోషల్ మీడియాలో మరో షాకింగ్ పోస్ట్ పెట్టాడు ఆర్జీవీ. భారతీయ సినిమా ఇండస్ట్రీలో విలక్షణ దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న రామ్ గోపాల్ వర్మ మంగళవారం (ఏప్రిల్ 7) మరో వసంతంలోకి అడుగు పెట్టారు. ఇవాళ ఆయన పుట్టిన రోజు కావడంతో పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు, నెటిజన్లు ఆర్జీవీకి బర్త్ డే విషెస్ చెబుతున్నారు. మరో వైపు ఆర్జీవీ కూడా తన పుట్టిన రోజు సందర్భంగా ట్విట్టర్ (ఎక్స్) లో ఒక ఇంట్రెస్టింగ్ పోస్ట్ షేర్ చేశారు. తనదైన స్టైల్లో' ఈ రోజు నేను నా చావుకు మరో ఏడాది దగ్గరయ్యానంటూ సెటైరికల్ పోస్ట్ చేశారు. అందువల్ల మీకు సంతోషం కలిగించే మరే ఇతర కారణాల కోసమైతే తప్ప.. ఈ రోజును వేడుకలా జరుపుకోవద్దు! ధన్యవాదాలు.. అంటూ రాసుకొచ్చాడు. ప్రస్తుతం ఆర్జీవీ పోస్ట్ సామాజిక మాధ్యమాల్లో బాగా వైరలవుతోంది. దీనిని చూసిన నెటిజన్లు ఆర్జీవీకి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

# వర్షం ఎఫెక్ట్.. వరుసగా రెండో మ్యాచ్ కూడా రద్దు..?

క్రీడా వాయిస్



గౌహతిలోని బరస్పరా క్రికెట్ స్టేడియంతోపాటు పరిసర ప్రాంతాల్లో కుండపోత వర్షం కురుస్తోంది. దీంతో వర్షం కారణంగా టాస్ ఆలస్యమవుతోంది. పరిస్థితి చూస్తే ఈ మ్యాచ్ కూడా రద్దయ్యే ఛాన్స్ ఉందని తెలుస్తోంది. ఐపీఎల్ 19వ సీజన్‌లోని 12వ మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. ఏప్రిల్ 6న కోల్‌కతా నైట్ రైడర్స్, పంజాబ్ కింగ్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో 3.2 ఓవర్ల ఆట తర్వాత వర్షం కారణంగా ఆటను నిలిపివేయాల్సి వచ్చింది. వర్షం కారణంగా 3.5 గంటల ఆట వృధా అయింది. అయినప్పటికీ, మ్యాచ్ ప్రారంభమవుతుందని అభిమానులు ఆశగా ఎదురుచూశారు. కానీ చివరకు, పిచ్ పరిస్థితి సరిగా లేకపోవడంతో మ్యాచ్ రద్దయింది. ఆ తర్వాత, వరుసగా రెండో మ్యాచ్ కూడా వర్షం కారణంగా రద్దవుతుందా? అనే పరిస్థితి కనిపిస్తోంది.19వ సీజన్‌లోని 13వ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ వర్సెస్ ముంబై ఇండియన్స్ తలపడుతున్నాయి. ఈ మ్యాచ్ గౌహతిలోని బరస్పరా క్రికెట్ స్టేడియంలో జరుగుతోంది. మ్యాచ్‌కు ముందు టాస్ ఎవరు గెలుస్తారో చూడటానికి అభిమానులు ఆసక్తిగా ఎదురుచూశారు. అయితే, వర్షం కారణంగా టాస్ ఆలస్యమైంది. సాయంత్రం 7 గంటలకు టాస్ జరగాల్సి ఉంది. అయితే, వర్షం కారణంగా బ్యాటింగ్ ఎక్కువగా ఉండటంతో టాస్ ఆలస్యమైంది. వర్షం వల్ల 30 నిమిషాల సమయం వృధా అయింది. కాబట్టి ఇప్పుడు అభిమానులు వర్షం విరామం కోసం వేచి ఉండాల్సి ఉంటుంది.

# వైభవ్ సూర్యవంశీ, ఆయుష్ మ్హాత్రేలకు షాకిచ్చిన బీసీసీఐ..

## అండర్-25 జట్టులో దక్కని చోటు..!

భారత క్రికెట్ భవిష్యత్తు ఆశాకిరణాలుగా భావిస్తున్న యువ సంచలనాలు వైభవ్ సూర్యవంశీ, ఆయుష్ మ్హాత్రేలకు ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. దేశవాళీ క్రికెట్‌లో పరుగుల వరద పారిస్తున్న ఈ ఇద్దరు ప్రతిభావంతులకు తాజాగా ప్రకటించిన భారత అండర్-25 జట్టులో చోటు దక్కలేదు. ఈ నిర్ణయం క్రీడా వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. అసలు వీరిని ఎందుకు పక్కన పెట్టారో ఇప్పుడు తెలుసుకుందాం.. భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ప్రతిష్టాత్మకంగా భావించే అండర్-25 జట్టు ఎంపికలో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. రాబోయే కాలంలో భారత టెస్ట్ జట్టుకు వెన్నెముకగా నిలిచే ఆటగాళ్లను గుర్తించేందుకు బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ప్రత్యేక టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఇందుకోసం ఎంపిక చేసిన 25 మంది సభ్యుల జాబితాలో వైభవ్ సూర్యవంశీ, ఆయుష్ మ్హాత్రే పేర్లు లేకపోవడం గమనార్హం. శ్రీలంకలో జరగనున్న రెడ్ బాల్ క్రికెట్ సిరీస్ కోసం భారత అండర్-19, అండర్-25 జట్లు పయనమవనున్న తరుణంలో ఈ నిర్ణయం వెలువడింది.

**ఏమిటీ కొత్త అండర్-25 టోర్నమెంట్..?**

ప్రస్తుత ఇండియన్ ప్రీమియర్ లీగ్ సీజన్ ముగిసిన వెంటనే, బీసీసీఐ ఈ ప్రత్యేక నాలుగు రోజుల మ్యాచ్‌ల టోర్నమెంట్‌ను ప్రారంభించనుంది. దేశవ్యాప్తంగా ఉన్న 64 మంది అత్యుత్తమ యువ క్రికెటర్లను నాలుగు జట్లుగా విభజించి ఈ పోటీలు నిర్వహిస్తారు. ఈ ప్రతిభావంతులను ఎంపిక చేయడానికి ఒక ప్రత్యేక ప్రాతిపదికను అనుసరించారు. అందులో 25 మంది ఆటగాళ్లు సి.కె. నాయుడు ట్రోఫీ, అండర్-23 వన్డే మ్యాచ్‌ల నుంచి, మరో 25 మంది ఆటగాళ్లను రంజీ ట్రోఫీ, విజయ్ హజారే, సయ్యద్ ముస్తాక్ అలీ వంటి ప్రధాన టోర్నీల నుంచి ఎంపిక చేశారు. మిగిలిన 14 స్థానాలను ఐపీఎల్ ప్రదర్శన ఆధారంగా భర్తీ చేయనున్నారు.





**వీరిని ఎందుకు ఎంపిక చేయలేదు?**

వైభవ్ సూర్యవంశీ, ఆయుష్ మ్హాత్రే వంటి మేటి ఆటగాళ్లను ప్రాథమిక జాబితాలో చేర్చకపోవడానికి ఒక బలమైన కారణం ఉంది. వీరిద్దరూ ప్రస్తుతం ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో బిజీగా ఉన్నారు. ఆయుష్ మ్హాత్రే చెన్నై సూపర్ కింగ్స్ తరపున, వైభవ్ సూర్యవంశీ రాజస్థాన్ రాయల్స్ జట్టులో సభ్యులుగా ఉన్నారు. ఐపీఎల్ ముగిసిన తర్వాత ఎంపిక చేసే టాప్ 14 మంది ఆటగాళ్ల జాబితాలో వీరి పేర్లు ఉండే అవకాశం మెండుగా ఉందని సమాచారం. కాబట్టి అభిమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

**ప్రకటించిన భారత అండర్-25 జట్టు సభ్యులు..**

ప్రస్తుతం ఎంపికైన జట్టులో ఆయుష్ దోసేజా, యశ్ ధుల్, మయాంక్ వర్మ, ఆయుష్ పాండే, శాశ్వత్ రావత్, మహేష్ పిథియా, రాజ్ లింభాని, ఆర్య దేశాయ్, సిద్ధార్థ్ దేశాయ్, ఆకిబ్ ఖాన్, కార్తీక్ యాదవ్, విద్యాధర్ పాటిల్, కె. హిమతేజ, భువనగిరి పున్నయ్య, పుఖరాజ్ మాన్, యశవర్ధన్ దలాల్, పార్థ్ వత్స్, ఈడెన్ ఆపిల్ టామ్, హిమాన్షు సింగ్, అమన్ మోఖడే వంటి ఆటగాళు ఉన్నారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైమ్ వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com